

# దత్తాత్రేయమ్



శ్రీ దత్తస్వామి విరచితమ్

# దత్తాత్రేయమ్



శ్రీ దత్తస్వామి విరచితమ్

# కవి పరిచయం

శ్రీదత్తస్వామి (జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి గారు) 16 సం. వయస్సులోనే సంస్కృతములో 100 గ్రంథములకు పైగా ఆధ్యాత్మికములో, శంకర-రామానుజ-మధ్వ మతత్రయ సమన్వయమును చేస్తూ రచించినారు. వీరు 19 సం. వయస్సులో కెమిస్ట్రీలో పి.హెచ్.డి.ని పొంది ప్రొఫెసరుగా పనిచేసినారు. వీరి వేదాంత ఉపన్యాసములు ఆంగ్లములో పది సంపుటములలో ముద్రణలో ఉన్నవి. వీరి సంస్కృత గ్రంథములు కొన్ని తెలుగు అనువాదముతో ఇప్పటికే ముద్రించినాము ( శ్రీదత్త గురు భగవద్గీత, శ్రీ దత్తోపనిషత్తులు, శ్రీకృష్ణ భాగవతమ్.... మొదలగునవి). వీరు లోకదృష్టిలో శ్రీ దత్తాత్రేయస్వామి ఉపాసకులు. వీరి ఆత్మీయ భక్తుల దృష్టిలో సాక్షాత్ శ్రీ దత్తాత్రేయ స్వరూపులు.

దశిక శ్రీ కృష్ణ సూర్యనారాయణ మూర్తి (అజయ్)

శిష్ట్లా ఫణికుమార్

Printed by :

**SRI DATTA JNANA PRACHARA PARISHAT**

Door No. 23-11-1/2, Ogiralavari Street,

Satyanarayana Puram, **VIJAYAWADA- 520 011.**

**Ph: 0866-2531167, Cell: 7207274412**

© Copyrights Reserved

**ఉదాత్తై రనుదాత్తై శ్చ, స్వరితై రనురంజిత: ।**
**వేద పాఠ ఇవాభాసి, త్రిమూర్త్యంశుభి రత్రిజ ! ॥**

(ఓ అత్రిపుత్రా! దత్తా! త్రిమూర్తుల తేజస్సులతో నీవు, ఉదాత్త – అనుదాత్త – స్వరితములను మూడు స్వరములతో రంజిల్లు వేద పఠనమువలె ప్రకాశించుచున్నావు.)

**ఉదయారుణ మధ్యాహ్న – తేజ స్సాయ తమో ద్యుతి: ।**
**త్రివర్ణ త్రిగుణై ర్దత్త!, త్రికాల ఇవ భానుమాన్ ॥**

(దత్తా! ఉదయమున ఎర్రగా, పగలు తెల్లని ఎండతో, సాయమందున చీకటి నలుపుతో భాసిల్లు సూర్యునివలె, సృష్టి స్థితి లయ కాలములందు రజస్సు – సత్త్వము – తమస్సులను త్రిగుణములతో శోభిల్లుచున్నావు.)

**సృష్టి స్థితి ప్రళయ కారణమస్య వేదా, ద్వ్యహ్మైవ య స్త్రిముఖ సూచిత దత్త దేవ: ।**
**అన్య స్వరూప మసమన్వయ హేతుముక్తం, తస్మాత్స ఏవ శరణం మమ వేద సిద్ధ:॥**

('యతోవాఇమాని' అను వేద వచనము ద్వారా, యీ జగత్తు యొక్క సృష్టి స్థితి ప్రళయములకు కారణము తానేనను సత్యమును తనయొక్క త్రిమూర్తి ముఖములతో సూచించు దత్తదేవుడే పరబ్రహ్మము. ఈ సమన్వయము ఇతర దేవతాస్వరూపములందు పొసగదు కావున అన్య రూపములను విడచినాము. కావున వేదము ద్వారా సిద్ధించిన ఆ శ్రీ దత్తుడే నాకు శరణము.)

**త్రిమూర్తయ స్త్రికర్మాణో, బ్రహ్మైకం హి త్రికర్మకృత్ ।**
**ఏకమేవేతి చామ్నాయా, ద్దత్తాత్రేయ సమన్వయ:॥**

(సృష్టి స్థితి ప్రళయములను మూడు పనులను చేయు వారు త్రిమూర్తులు. ఈ మూడు పనులను చేయునది పరబ్రహ్మము ఒక్కటేయని 'ఏకమేవ' అని వేదము పలుకుట వలన, ఏకరూపమగు శ్రీ దత్తాత్రేయ స్వరూపమునందే సమన్వయము అగుచున్నది).

**బ్రహ్మా త్వమేవ జగతో రచనా విధానే, విష్ణు స్త్వమేవ పరిపాలన శాసనేఽస్య ।**
**రుద్ర స్త్వమేవ విలయజ్వలనేఽప్యముష్య, వేష స్త్రిధాఽపి నట ఏక ఇహా త్వమేవ ॥**

(ఈ జగత్తును చేయు రచనా విధానములో నీవే బ్రహ్మా యనబడుచున్నావు. ఈ జగత్తు

యొక్క పరిపాలన, శాసనమును చేయుట యందు నీవే విష్ణువని చెప్పబడుచున్నావు. ఈ జగత్తు యొక్క ప్రళయ దహనమున నీవే రుద్రుడవని కీర్తింపబడుచున్నావు. ఈ మూడు వేషములలోనున్న ఒకే ఒక నటుడవు నీవే కదా).

**హే దేవదేవ! దయనీయ దయా పయోధే!,**
**హే భక్తి భావ ముని మాన్య మనోనివృత్తే! ।**
**హే వేదవేద్య విదుషామపి వాదదూర!,**
**హే దత్త! చిత్త మిద మావిశ విత్త మత్తమ్ ॥**

(ఓ దేవదేవ! దయనీయులందు దయాపయోనిధీ! భక్తి భావములు గల మాన్యులగు ముని మనస్సులకును అందని వాడా! వేదవేద్యులగు విద్వాంసుల చర్చలకును చిక్కని వాడా! దత్తా! విత్తముచే మత్తమైన నాయీ చిత్తమును ఆవేశించుము).

**త్రిమూర్తి వదనోజ్జ్వలం త్రిభుజ యుగ్మ సంశోభితం,**
**త్రిలోక తల సంచరం చరణ పాదుకా ఘట్టనమ్ ।**
**చతుశ్శునక సంవృతం విమల ధర్మ ధేను శ్రితం,**
**మహర్షి కుల నాయకం నమత దత్త దేవం గురుమ్ ॥**

(త్రిమూర్తి ముఖములతో ప్రకాశించువాడును, ఆరు భుజములతో శోభిల్లు వాడును, త్రిలోకములందు సంచరించువాడును, చరణ పాదుకల ధ్వనిని చేయువాడును, నాలుగు శునకములతో కూడిన వాడును, శుభ్రమైన ధేను రూపమున నున్న ధర్మదేవతకు ఆశ్రయమైన వాడును, మహర్షి కుల నాయకుడునగు గురు దత్తదేవుని నమస్కరించుడు.)

**అత్రే: పుత్రాయతే యో యతిపతి రదితే: పుత్ర పత్ర శ్రితాఙ్ఘ్రి :,**
**సాక్షా దోంకార వాచ్య త్రిరవ విధి హరి త్ర్యంబకాలంబనంచ ।**
**యో వై వైరాగ్య భాగ్య స్థిరకర కరస న్ముక్తి దాయీచ మాయీ,**
**దత్తాత్రేయోఽస్తి సోఽయం మమ హృదయ సర: క్రీడయా బ్రహ్మ హంస:॥**

(ఎవరు అత్రిమునికి పుత్రునిగా మారెనో, యతులకు పతియును, పాదములందు ఆశ్రయించిన దేవతలనెడి పూజా పత్రములు కలిగియున్న వాడును, బ్రహ్మ విష్ణు శివులను అకార ఉకార మకారములతో ఏర్పడిన ఓంకారవాచ్యుడై త్రిమూర్తులకు ఆధారమైనవాడును, ఎవరు వైరాగ్య సంపదను స్థిర పరచగల సత్య మోక్షమును చేతితో ప్రసాదించగల వాడునైయున్నాడో, మాయగల వాడును, నాహృదయ సరోవరము నందు క్రీడించు

బ్రహ్మహంసగానున్న వాడును అగునట్టి ఆ దత్తాత్రేయుడు విరాజిల్లుచున్నాడు.)

**నిరంతరం మృత్యు భయేన కంపతే, మనో మనా గప్యభయం న విందతే ।**
**క్షణోఽపి మృత్యు ర్నిరయే తత: పరం, కియాంస్తు కాల: ప్రతిహన్యతా మితి ॥**

(ఈ మనస్సు నిరంతరము మృత్యు భయము చేత కంపించుచున్నది. దీనికి కొంచెము కూడ అభయము లభించుటలేదు. మృత్యువు క్షణ కాల మాత్రమే ఐననూ, దాని తరువాత నరకములో ఎంత కాలము ఉండవలయునో కదా అన్నదే అసలు భయమై ఉన్నది)

**పాపాని తాపాయ కృత స్మృతాని, కాలోఽపి కల్లోలయతీద్ధ పాశ: ।**
**కాలేఽస్మి చాస్మిన్ వికలో విమూఢ, స్త్వమంతరాశా కిరణ: కిలైక: ॥**

(దత్తా! చేసిన పాపములన్నియు గుర్తుకువచ్చి పశ్చాత్తాపమును కలిగించుచుండగా, కాలుడు తన పాశమును ఝుళిపించుచూ కనపడుచుండగా, మనస్సు కల్లోలమును చెందుచున్నది. ఇట్టి యీ సమయమునందు వికలుడనై ఏమి చేయుటకును తోచని మూఢుడనై యుండగా, లోపల స్ఫురించిన ఒకే ఒక ఆశాకిరణము నీవై యున్నావు.)

**మృత్యు స్సన్నిహిత: కరాళదశనై: కాలస్య తే కింకరా:,**
**దృశ్యన్తే వికట స్వర ప్రహసితై ర్భూయ: ప్రకంప ప్రదా: ।**
**కాలేఽస్మిన్ కలనీయ ఏవ హి భవాం స్త్రాతా విధాతా హరి:,**
**కాలారిశ్చ ముఖత్రయేణ పరమబ్రహ్మ త్రయీ గోచరమ్॥**

(మృత్యు కాలము సమీపించి వార్ధక దశ వచ్చియున్నది. కాలుని కింకరులు భయంకరములగు కోరలతో వికట స్వరములతో నవ్వుచూ, మాటిమాటికిని కంపమును కలిగించుచు, కనపడుచున్నారు. ఇట్టి యీ సమయమున, త్రయీగోచరమగు పరబ్రహ్మయును, మూడు ముఖములతో బ్రహ్మ విష్ణు శివాత్మకుడవైన రక్షకుడవగు నీవే కనపడవలసినవాడవు గదా).

**ఏకో దేవో హ్యత్రిపుత్రోఽత్ర గమ్యో, గంతాఽప్యేకో దత్త కారుణ్య లక్ష్య: ।**
**మార్గోఽప్యేక స్త్యాగకృ దత్త సేవా, జ్ఞేయ జ్ఞాతృ జ్ఞాన మేత త్త్రిపుట్యామ్ ॥**

(అత్రి పుత్రుడైన దత్త దేవుడే ఏకైక గమ్యము. దత్త కారుణ్యమే లక్ష్యముగా గల సాధక

జీవుడే ఏకైక గంత. త్యాగము చే కూడిన దత్త సేవయే ఏకైక మార్గము. జ్ఞేయము, జ్ఞాత, జ్ఞానము అనబడు త్రిపుటియే ఇది.)

**శ్రీదత్త స్మరణం కార్యం, వార్ధకే మరణే రణే,**
**సంసార తరణం ముక్తేః, కరణం శరణం పరమ్ ॥**

(ఈ వార్ధక దశయను మరణ రణము వచ్చినపుడు, సంసార తరణము, ముక్తి కరణము, పరమ శరణము అగు శ్రీ దత్త స్మరణమును చేయ వలెను.)

**దత్తాత్రేయే సతి సతి పిత ర్యస్మదీయే దయాళౌ,**
**వాత్సల్యాంభో నిధి ఘన నిధౌ కాను చింతా కదాఽపి? ।**
**అస్మిన్ లోకే పరజగతి చ ప్రోద్ధరే దేష దేవో,**
**బ్రహ్మానందే చరతు సతతం నూతనం జీవనం మే ॥**

(ఘనమైన వాత్సల్య సాగరుడును, దయాళువును, సత్యమును అగు నా తండ్రియగు దత్తాత్రేయుడుండగా ఎప్పుడును ఏ చింతయును పొందనేల? ఈ దత్తదేవుడు యీ లోకమునందును, పరలోకము నందును నన్ను ఉద్ధరించ గలడు. కావున యీ నూతన జీవితము నిరంతరము బ్రహ్మానందములో సంచరించు గాక.)

**త్వమేవ మమ సద్గురు స్త్వమసి మే పితా త్వం ప్రసూ,**
**స్త్వమస్య జగతో జని స్థితి లయస్య సత్కారణమ్ ।**
**త్వమేవ మమ సర్వ మత్రిభవ! దత్త దేవ! ప్రభో!,**
**సముద్ధరతు మా మపార కరుణార్ణవో యద్భవాన్ ॥**

(అత్రిపుత్రా ! దత్త దేవా! ప్రభూ! నీవే నా సద్గురువు. నీవే నా తండ్రివి. నీవే నాతల్లివి. ఈ జగత్తు యొక్క సృష్టి స్థితి లయముల యొక్క సత్కారణము నీవే. నీవు అపార కరుణా సాగరుడవు కావున నన్ను ఉద్ధరింపుము.)

**దత్తాత్రేయ గురో! తవైవ మహిమా సర్వంహి మజ్జీవితే,**
**యచ్ఛాభూ ద్భవితా భవత్యపి భవల్లీలా కలో న్మీలితమ్ ।**
**సాహంకార మనో మయేన హి మయా కర్తృత్వ మాలింగితం,**
**భోక్తాఽప్యేష భవాన్ జడోఽస్మి విషయ భ్రాంతో నితాంతం ప్రభో! ॥**

(ఓ గురుదత్తాత్రేయా! నా జీవితములో జరిగినది, జరుగుచున్నది, జరుగపోవుచున్నదియు అంతయును నీ లీలా కళ చేతనే ఉత్పన్నమైన నీ యొక్క మహిమయే. అహంకారముతో కూడిన మనస్సు వలన నేను కర్తనని భావించితిని. లీలా వినోదము ననుభవించు భోక్తయును నీవే. ఓ ప్రభూ! నేను నిరంతరము విషయ భ్రాంతుడనగు జడమును మాత్రమే కదా.)

**గురోదత్త! గురోదత్త!, దత్త దత్త ! గురోగురో! ।**
**ఉద్ధరోద్ధర మాం స్వామిన్!, పతితం పతి పండిత! ॥**

(గురుదత్తా! గురుదత్తా! దత్తా! దత్తా! గురూ! గురూ! స్వామీ! నన్ను ఉద్ధరించుము, ఉద్ధరించుము. ఓ పండిత పతీ! నేను పతితుడను కదా.)

**భీతోఽస్మి మృత్యో రహ మన్వహంభో, దత్త ప్రభో ! పాహి భయా ద్భయార్తమ్ ।**
**తప్తోఽస్మి పశ్చా న్మరణాచ్చ పశ్యన్, తం నారకాగ్నిం నరకాష్ఠ దాహమ్ ॥**

(ఓ దత్త ప్రభూ! నేను సదామృత్యువును చూచి భయపడుచున్నాను. ఈ భయమునుండి, భయార్తుడనగు నన్ను రక్షించుము. మరణానంతరము జీవులను కట్టెలను కాల్చుచున్న ఆ నరకాగ్నిని చూచి భయముతో యిప్పుడే కాలుచున్నాను.)

**త్వమూహ సమతీత ఇత్యఖిల వేదరాశే ర్వచో,**
**ధియో దధతి శూన్యతా సకల సీమ మాత్రాన్తరమ్ ।**
**యత: ప్రథమ భూతదృ గ్గగన శూన్య మాకాశతా,**
**త్వమస్యఖిల భూతకృ త్తదపి భూత సృష్టే: పర: ॥**

(అన్ని వేదములును నీవు ఊహలకు సైతము అందవని పలుకుచున్నవి. ఈ బుద్ధులు ఆకాశమనబడు ఖాళీ స్థలము యొక్క అవధులగు పరిధుల వరకే పోగలుగుచున్నవి. ఈ ఆకాశము పంచభూతములలో మొదట సృష్ట్యాదిలో సృష్టించబడినది. పంచభూతములను సృష్టించిన నీవు యీ పంచభూతములకన్న భిన్నమై, యీ పంచభూతాత్మక సృష్టికి అందక అతీతుడవైయున్నావు.)

**గుణత్రయ వివేకినాం మతమిదం యథా వై నృణాం,**
**గుణత్రయ విభావనా తవ జగ త్తథా భావనా ।**

**అతశ్చిదితి శక్తి రిత్యచలతత్త్వ మిత్యుచ్యతే,**
**గుణత్రయ మిదం జగ త్త్వదుపమాన మేతే నరా: ॥**

(త్రిగుణ విచారమును చేయు వారి మతము ప్రకారముగా – ఏ విధముగా నరులయొక్క భావములన్నియు త్రిగుణములనబడుచున్నవో, అట్లే నీ భావస్వరూపమైన యీ సృష్టి అంతయును నీ దృష్ట్యా త్రిగుణ స్వరూపమనుబడుచున్నది. కావున చైతన్యము, జడశక్తి, జడమైన ఘన పదార్థము అనబడు మూడు జగత్తత్త్వములే వరుసగా సత్త్వము, రజస్సు, తమస్సు అనబడు త్రిగుణములుగా చెప్పదగియున్నది. ఇచట, నీతో పోల్చబడిన యీ జీవుడు నీకు ఉపమానముగా చెప్పబడినాడే తప్ప, జీవుడు నీవే అని కాదుగదా.)

**జ్ఞాతా త్తృప్తి ర్భవే ద్యాహి, న జ్ఞేయా దపి సైవ చేత్ ।**
**అనప్రథమ పక్షాత్తు, సత్పక్ష స్సత్ఫలో వర: ॥**

(తెలియుటకు వీలుగాని వాడవని తెలిసినప్పుడును ప్రయత్నము అనవసరము కావున యిచ్చటను తృప్తి లభించుచున్నది. ఈ పక్షము సత్యము కావున సత్ఫలమునిచ్చును కావున ఇది శ్రేష్ఠము. నీవు ఆత్మ స్వరూపునిగా తెలియబడినప్పుడు తృప్తి లభించుచున్ననూ అది అసత్యము కావున ఫలము నొసగదు కావున నిష్ప్రయోజనమే కదా.)

**దత్తేత్యక్షరయో రనీక్ష్య మహిమా వేదై స్సముద్ఘోషితో,**
**విద్వాంసో య ముదాహరన్తి సతతం వేదాంత జిజ్ఞాసవ: ।**
**సోఽయం విశ్వసమి త్సమిద్ధ దహనో జాజ్వల్య మానోఽనిశం,**
**పాయాన్న: పరమార్థ గోచర మహాసార స్సురై శ్చార్థిత:॥**

(వేదములచే ఘోషింపబడినదియును, వేదాంత జిజ్ఞాసువులైన పండితుల చేత నిత్యము ఉదహరించబడినదియును, విశ్వమను సమిధను చేరి ప్రకాశించు నిత్యాగ్నియును, పరమార్థ గోచరమైన మహా సారమై, దేవతల చేత ప్రార్థించబడిన 'దత్త' అను రెండు అక్షరముల యొక్క అగోచర మహిమ మమ్ములను రక్షించుగాక.)

**త్వమేవ పరమా గతి: పరమ పూరుష ! ప్రార్థితా,**
**త్వదర్థమిహ జీవితం కలయితుం త్వదీయాం గతిమ్ ।**
**త్వమన్తర ధియోఽపి న స్పృశసి వేద్మి సత్తామితం,**
**కృతిక్రమణ! విద్యుదర్థమివ లోహవల్లీ గతమ్ ॥**

(ఓ పరమపురుషా! అర్థింపబడిన పరమ గతినీవే. నీ మార్గమును చూచుటకై ఏర్పడినదే యీ జీవితము. నిన్ను యీ లోలోపలి బుద్ధులు కూడా అంటజాలవు. కావున నీవు అనూహ్యుడవు. నీవు యీ సృష్టి భాగమగు ఒక ఉపాధిని అవేశించినపుడు దాని ద్వారా నీవు కేవలము ఉన్నావని మాత్రమే, లోహపు తీగెను ప్రవేశించిన విద్యుత్తు ఉన్నదని మాత్రమే తెలిసినట్లు తెలుసుకొను చున్నాను).

**సాష్టాంగం మత్ప్రణామో నమదఖిల జగ జ్జీవ జాలాయ, లీలా -**
**కల్లోలాలోల బాలాయిత యతి తతయే, భీత భూతాయ నామ్నా ।**
**సత్తా మాత్రైక బోధ్య స్వవిషయ మహిమ ద్వార గమ్యాయ తుభ్యం,**
**దత్తాయోన్మత్త చిత్త స్థితి హర గురవే జ్ఞాన విత్తోత్తమాయ ॥**

(సర్వజీవులచే నమస్కరించబడిన వాడును, తన లీలల చేత యతులను సైతము కల్లోల పరచి పసిబాలురిగా చేసి ఆడించువాడును, తన పేరును ఉచ్చరించుట చేత దుష్టభూతములు భయపడునట్లు చేయువాడును, అనూహ్య మహిమలను ప్రదర్శించుట చేత కేవలము అనూహ్యుడగు తాను ఉన్నానని బోధించు వాడును, చిత్తము యొక్క ఉన్మాద స్థితిని హరించు గురువగువాడును, జ్ఞాన విత్తము చేత ఉత్తముడును అగు శ్రీదత్తునికి నా యొక్క సాష్టాంగ ప్రణామము.)

**త్రియంబక ద్వంద్వ మనంబ మాద్యం, లోకావలంబం కరుణా కదంబమ్ ।**
**బింబాధరం జన్మ దినేందు బింబం, శ్రీ దత్త మత్రి ప్రభవం భజామః ॥**

(మూడు జతలు కన్నులు కలవాడును,
(తల్లి లేని వాడును, ఆద్యుడును, లోకములకు ఆధారమైన వాడును, కరుణామేఘమును, దొండ పండు వంటి పెదవి కలవాడును, పూర్ణేందుబింబము గల పూర్ణిమ జన్మదినముగ కలవాడును, అత్రికి జన్మించిన వాడును అగు శ్రీదత్తుని భజించుచున్నాము.)

**స తాడ్యమాన శ్శకటస్య వాహకో, యథా వృషా ధావతి వేత్ర ధారిణః ।**
**తథాఽహ మిద్ధో నిజ కర్మణా చ తే, సరామి సంసార వహః పశు ప్రభో! ॥**

(ఏ విధముగా బండికి కట్టబడిన ఎద్దు బెత్తముచేత కొట్టబడుచూ, బండిని లాగుకొని పరుగెత్తు చుండునో, అదేవిధముగా ఓ పశుపతీ! నేనును నాకర్మ చేత కొట్టబడుచూ, యీ సంసారమును లాగుకొని నిరంతరము పరుగెత్తు చున్నాను.)

**దత్తాత్రేయ మహం భజే త్రివదనం షడ్బాహు మావత్సలం,**
**యేనైవ ద్విగుణీకృతో ముఖభుజై: స్కందో హి శిష్య: కృత:।**
**య: కర్తా భువనావళీ ఘటతతే ర్భర్తా చ హర్తా స్వయం,**
**యం ధ్యాయంతి నిరంతరం శ్రుతివిద శ్శృణ్వంతి గాయంతిచ॥**

(పరిపూర్ణ వాత్సల్యము గల ఏ గురువు తన యొక్క త్రిముఖములు, షడ్భుజముల కన్న రెట్టింపు ముఖములతోను, బాహువులతోను, తన శిష్యుడగు సుబ్రహ్మణ్యుని చేసి చూపించి, తనకన్న తన శిష్యుని రెండింతలు గొప్పవానిని చేసియున్న వాడును, ఎవరు సకల భువనములను ఘటములకు కర్తయు, భర్తయు, హర్తయు అగుచున్నవాడును, ఎవరిని వేదవేత్తలు విని ధ్యానించి కీర్తింతురో అట్టి దత్తాత్రేయుని భజించుచున్నాను.)

**సపాశ కాలే కలితేఽపి వార్ధకే, న హన్యతే పుత్రసతీ ధనేషణా।**
**అనంత జన్మార్జిత సంస్కృతే రయం, మహా ప్రభావ: కథమస్య రక్షణమ్ ? ॥**

(పాశమును చేతిలో ధరించి యముడు యీ వార్ధక దశయందు కనపడుచున్ననూ, దారేషణ, పుత్రేషణ, ధనేషణలు అదృశ్యమగుట లేదు. దీనికి కారణము అనేక జన్మల సంస్కారము యొక్క మహా ప్రభావము. ఇక వీనికి ఎట్లు రక్షణము?)

**కోటి కోటి భవపాప నాశకో, మోహసాగర తితీర్షు వాహక: ।**
**లోక జన్మ గతి నాశ దాయకో,దత్త ఏవ మమ రక్షణ క్షమ: ॥**

(కోటి కోటి జన్మల పాపములను నాశనము చేయువాడును, మోహసాగరమును దాటించు వాడును, ఈ జగత్తు యొక్క సృష్టి స్థితి లయములను చేయువాడును అగు దత్తుడే నన్ను రక్షించ గల సమర్థుడు.)

**అసూయా నిర్ముక్త స్త్రిగుణ మదదృ గ్వర్జిత మనా,**
**య మాదత్తే వృద్ధ స్తనయమివ రక్షా సమయత: ।**
**తదేవాయం దత్త: కథిత ఇహ తత్త్వార్థ విషయే,**
**సదత్తో బాహ్యార్థా దభవ దనసూయాత్రి తనయ: ॥**

(అసూయ లేని వాడే అనసూయ. త్రిగుణాహంకారములు లేని వాడే అత్రి. అట్టి వాడు వార్ధక దశలో పుత్రుని సాయమును అపేక్షించినట్టు భగవంతుని సాయమునర్థించును. అట్టి వానికి సాయపడుటకై లభించిన దేవుడే దత్తుడు అనుట తత్త్వపరమైన దత్త శబ్దార్థము.

అట్లుకాక, అనసూయ - అత్రి దంపతుల పుత్రుడనుట బాహ్యార్థము అగును.)

**కాషాయవస్త్రం స్వవశీకృతాస్త్రం, రాజీవ నేత్రం రమణీయగాత్రమ్ ।**
**వేదాంత వేత్రం కరభైక్ష్య పాత్రం, సద్బోధ మాత్రం భజదత్త చిత్రమ్ ॥**

(కాషాయ వస్త్ర ధారియును, సర్వాస్త్రములు తన వశమందున్నవాడును, పద్మ నేత్రుడును, రమణీయ శరీరము కల వాడును, వేదాంత జ్ఞానమను బెత్తమును ధరించిన వాడును, చేతిలో భిక్షా పాత్రను పట్టుకొన్న వాడును, కేవలము తాను ఉన్నానని నిరూపించు వాడును అగు దత్తుడను చిత్ర తత్త్వమును భజించుము.)

**కంబు కంఠ! నమస్తేఽస్తు, దత్త! బింబాధరద్యుతే! ।**
**జగదాలంబ! రోలంబ!, మాయాంబా హృదయాంబుజే॥**

(శంఖము వంటి మెడ గలవాడా! దొండపండు వంటి పెదవి కలవాడా! జగదాధారుడా! మాయామాత హృదయకమలమందు భ్రమరమా! దత్తా! నీకు నా నమస్కారము.)

**అనసూయక మస్మాకం,నాయకం ముక్తిదాయకమ్ ।**
**వేదాంతగాయకం దత్తం, సాష్టాంగం ప్రణమామి తమ్॥**

(అనసూయా పుత్రుడును, మాకు నాయకుడును, ముక్తి దాయకుడును, వేదాంత గాయకుడును, అగు ఆ దత్తుని సాష్టాంగముగ నమస్కరించుచున్నాను.)

**పద్మాసనాయ కర పద్మ గతాగమాయ, నారాయణాయ నళినీ దళ లోచనాయ ।**
**సర్వేశ్వరాయ పుర గర్వ హరాయ తుభ్యం, నారంగవర్ణ వసనాయ నమో నమస్తే ॥**

(పాణిపద్మము నందు వేదముగల పద్మాసనుడును, నళినీ దళనేత్రుడగు నారాయణుడును, త్రిపురగర్వమును హరించిన సర్వేశ్వరుడును, నారింజ పండు రంగు కల వస్త్రమును ధరించినట్టి నీకు నమో నమః)

**రణం మరణ మాసన్నం, మా మాలోకయ లోకప! ।**
**పార్థం వ్యర్థ పదాక్షేప - పూర్వ పక్షం పురా యథా ॥**

(ఓ లోకేశ్వరా! మరణ రణమునకు చేరువైనట్టి నన్ను, పూర్వము వ్యర్థ పదముల చేత

ఆక్షేపించుచూ పూర్వ పక్షము చేసిన పార్థుని చూసినట్లు చూసి అనుగ్రహించుము.)

**భజభజ ప్రియ దత్త మతీంద్రియం, న వచసా మనసా చ ధియాగతమ్ ।**
**శ్రిత కృతే నర రూప ముపాశ్రితం, గురువరం వరదాభయ దాయకమ్ ॥**

(ఇంద్రియ జ్ఞానమునకు అతీతుడును, వాక్కుకు, మనస్సుకు బుద్ధికి అందని వాడును, ఆశ్రితులకొరకు నరాకారమును ఆశ్రయించిన వాడును, వరద - అభయ దాయకుడును, గురువరుడైన ప్రియ దత్తుని భజించుము భజించుము.)

**హే దత్త! హృత్తిమిరభిత్తి విభేద బోధ!, హే దత్త! మత్త జన చిత్త మలాపహారిన్! ।**
**హే దత్త! విత్త సుత దార నివృత్త గమ్య!, హే దత్త! కృత్తివసన! త్వయి కోను వేత్తి? ॥**

(హృదయతిమిరమను గోడను భేదించు బోధను చేయు దత్తా ! మదించిన జనుల చిత్త మలమును హరించు దత్తా! ఈషణా త్రయమును నివారించగలవారికి చిక్కిన దత్తా! కృత్తివాసా! దత్తా! నీ విషయమును తెలిసిన వాడు ఎవడు గలడు?)

**త్వం ప్రపూజ్యో గురుర్బ్రహ్మా,మాతా విష్ణుః పితా శివః।**
**మధ్వో రామానుజ స్త్వం చ, శంకరో బోధక త్రయమ్॥**

(నీవు పరమపూజ్య గురువైన బ్రహ్మావు. నీవు మాతృరూప విష్ణువు. నీవు పితృ రూప శివుడు. మధ్వ - రామానుజ - శంకర రూపివైన ఆచార్య త్రయము నీవే.)

**ఈషణా త్రయ మప్యేతత్, త్వయా సృష్ట మిహార్గళమ్।**
**అత్యేతి య స్స తే యాతి, త్ర్యంబకానా మనుగ్రహమ్॥**

(నీ చేత సృష్టించ బడిన ఈషణా త్రయమను యీ అడ్డంకిని ఎవడు దాటగలడో అట్టి వాడు నీ మూడు నేత్రముల దయకు పాత్రుడగును).

**కిం శైల మందిర! విలంఘ్య గుణ త్రయాద్రిం?,**
**కింవార్ధితల్ప! భవ సాగర తారణేన?।**
**కిం పద్మ పీఠ! షడతీత్య చ పద్మచక్రం,**
**సాక్షా త్త్వయీహ కలితే గురు రూప మేత్య ॥**

(ఓ శైలవాసా! త్రిగుణములను శైలములను లంఘించి ఫలమేమి? ఓ సాగర శయనా! సంసార సాగరమును దాటి ప్రయోజనమేమి? ఓ పద్మ పీఠా! ఆరు చక్ర పద్మములను దాటిననూ ఉపయోగమేమి? త్రిగుణ రూపముతో యీ సంసారములోనే భక్తుల బంధములతో గూడిన గురురూపముతో నీవు యిచ్చటనే లభించుచున్నావు కదా.)

**జ్ఞానం వేహ విభూతి ర్వా, యత్కించి ద్దర్శితం మయా।**
**సర్వం దత్తగురో రేవ, చాపల్యం తు మమధ్రువమ్॥**

(ఇచ్చట నాచేత ఏమాత్రము జ్ఞానమైననూ, మహిమయైననూ ప్రదర్శించబడినచో అది అంతయును దత్తగురువుదే. అట్లుకాక ఏదైనా చాపల్యము కనపడినచో అది మాత్రము నిస్సంశయముగా నాదే.)

**శుష్క పత్ర ధ్వని ర్దోషో, వ్యజనస్యైవ మర్మర: ।**
**గుణస్తు ధారకస్యైవ, చలనం పవన ప్రదమ్ ॥**

(తాటాకుల విసిన కర్రతో విసరుచుండగా ఎండిన ఆకుల ధ్వని, విసినకర్ర యొక్క దోషమే. ఆ విసినకర్ర యొక్క గాలినిచ్చు చలనము అను గుణము విసరు వానియొక్క శక్తి యొక్క గుణమే. ఇదే విధముగా గుణము భగవంతునిది, దోషము జీవునిది యని భావము.)

**శంఖ చక్ర దమరు త్రిశూలక – స్రక్కమండలు ధరం కరాంబుజై: ।**
**బ్రహ్మవిష్ణు శివ వక్త్ర వారిజం, దత్త దైవత ముపాస్మహే వయమ్ ॥**

(శంఖ, చక్ర, దమరుక, త్రిశూల, మాల, కమండలములను పాణి పద్మములతో ధరించిన వాడును, బ్రహ్మ విష్ణు శివ ముఖ పద్మములు కలవాడును అగు దత్త దైవమును మేము ఉపాసించుచున్నాము. )

**వామాంక దేవ్యనఘయా సముపేత మంగే,**
**యజ్ఞోపవీత కలితంచ కషాయ వస్త్రమ్ ।**
**యస్యాశ్రమ: క ఇతి బోద్ధు మశక్య మేకం,**
**దత్తం భజే ప్రణవ వాచక మప్యనూహ్యమ్ ॥**

(వామాంకమున అనఘా దేవితో కూడిన వాడును, యజ్ఞోపవీతమును ధరించిన వాడును,

కాషాయవస్త్రధారియును, ఏ ఆశ్రమములో ఉన్నవాడో తెలియుటకు వీలుకాని వాడును, ఓంకారము చేత సూచింపబడినను అనూహ్యుడును అగుదత్తుని భజించుచున్నాను.)

**కాషాయవాసా: కమనీయకాయ:, కాదంబినీ కాలజటాకపర్ద: ।**
**కుండ్యక్ష మాలా కలిత: కరాభ్యాం, దత్తోఽయ మాయాతి యమస్తు యాతి॥**

(కాషాయ వస్త్రధారియును, కమనీయ శరీరము కలవాడును, మేఘమువలె ప్రకాశించు జటాజూటము కలవాడును, చేతులతో కమండలము రుద్రాక్ష మాలయు కలవాడును అగు దత్తుడు నా వైపునకు వచ్చుచుండగా, యముడు తిరుగు ముఖము పట్టి పోవుచున్నాడు.)

**రే మూఢ! యాసి యది తన్నిరయం రయేణ, .**
**మృత్యో: పరం కథ మయం స్మరణం సమేతి ।**
**బ్రహ్మేశ్వరాచ్యుత ముఖత్రయ పద్మసక్త -**
**కాలాలక భ్రమర విభ్రమ దత్త దేవ: ?**

( ఓ మూర్ఖుడా! నీ మృత్యువు అనంతరము నీకు నరకమునకు పోవలసిన ఏర్పాటు నిజముగా ఉన్నచో, త్రిమూర్తి ముఖ పద్మములందు తుమ్మెదల వంటి ముంగురులు కల యీ దత్త దేవుడు నీ స్మృతిలోకి ఎట్లు వచ్చును.)

**దత్తం భజ త్రిముఖ వృత్తాంబుజ భ్రమణ మత్తాళి కుంతల ధరం,**
**చిత్త భ్రమ క్షపణ కృత్తాపహారి పద సత్తార్థ బోధక గురుమ్ ।**
**విత్తాది బంధ విషయాత్తవ్యధా జన విపత్తారణాంఘ్రి యుగళం,**
**ఛేత్తార ముక్త మిహ వేత్తార మేకమపి హృత్తామస చ్ఛిద మజమ్ ॥**

(మూడు గుండ్రని ముఖములందు తిరుగు తుమ్మెదల బోలు ముంగురులు కలవాడును, చిత్త భ్రాంతిని పోగొట్టి తాపమును హరించువాక్యములతో పరమ సత్యమును బోధించు గురువును, ధనాది బంధముల వలన ఏర్పడిన బాధల వలన ఏర్పడు కష్టములలో చిక్కిన భక్తులను ఉద్ధరించ గల పాదద్వయము కలవాడును, ఇచ్చట 'దత్తం ఛిన్నం' అను సామెతతో చెప్పబడినవాడును, ఏకైక సత్యజ్ఞానియును, హృదయాంధకారమును ఛేదించు వాడునగు జన్మరహితుడైన దత్తుని భజించుము.)

**త్వాం జానామి న కించిదప్యవగతే ర్బుద్ధే రతీతోఽసి నో,**
**జ్ఞేయోఽసీతి కిలావశిష్ట మిహ తే జ్ఞానం త్విదం కేవలమ్।**
**అజ్ఞేయోఽపి భవానసీతి విదితం హ్యజ్ఞేయ లీలాదృశా,**
**బ్రహ్మజ్ఞాన మిదం సమస్త మమృతం వేదార్ణవాదుద్ధృతమ్ ॥**

(ఊహించు శక్తిగల బుద్ధికి అతీతుడవు కావున నీ గురించి కొంచెము కూడ తెలియదు. కావున నీవు ఏ విధముగాను తెలియరానివాడనియే తేలినట్టి జ్ఞానము. అనూహ్యములగు నీ లీలల ద్వారా నీవు అనూహ్యుడైనను ఉన్నావని తెలియుచున్నది. ఇదే వేద సముద్రమునుండి ఉద్ధరించబడిన సమస్తమగు బ్రహ్మజ్ఞానామృతము.)

**దర్శన స్పర్శ సంవాద - సహవాస చతుష్టయమ్ ।**
**భాగ్యం దాతుం తదార్తేభ్యో, నర రూపేణ దృశ్యసే ॥**

(అనూహ్యుడగు నిన్ను దర్శించి, స్పృశించి, నీతో సంభాషించి నీతో కలసి నివసించుటయను భాగ్య చతుష్టయమునకై ఆర్తి చెందుచున్న భక్తుల కొరకు నీవు నరావతారధారివై కనపడుచున్నావు.)

**అత్రే: పుత్రో నందయం శ్చానసూయాం, బ్రహ్మర్షీణాం బోధకో బ్రాహ్మణో య: ।**
**దత్తాత్రేయో నామ నారాయణోఽయం, సాక్షాద్బ్రహ్మ శంకర స్స త్రిమూర్తి: ॥**

(అత్రి పుత్రుడును, అనసూయానందనుడును, బ్రహ్మర్షులకు బోధకుడును, బ్రాహ్మణుడును, అగు దత్తాత్రేయుడను పేరుతో త్రిమూర్తిగా నారాయణుడు, బ్రహ్మయు, శంకరుడును, సాక్షాత్తుగా తానే అగుచున్నాడు.)

**కర్మత్రయ వశాదేక:, త్రిమూర్తిర్దృశ్యతే యథా ।**
**నానామర్త్యావతారస్త్వం, నానా కర్మవశాత్తథా ॥**

(సృష్టి, స్థితి లయములను మూడు కర్మల వలన ఏ విధముగా మూడు మూర్తులుగా కనపడుచున్నాడో, అదే విధముగా అనేక కర్మలను చేయుటకు అనేక నరావతారములుగా కనపడుచున్నాడు.)

**ఏకదైవ త్రిలోకేషు, త్రిమూర్తి ర్భవితా భవాన్ ।**
**భిన్న మర్త్యావతారోఽపి, భిన్నదేశేషు చైకదా ॥**

(ఒకే సమయములో మూడు లోకములలో మూడు మూర్తులుగా నీవు ఉన్నావు. అట్లే ఒకే సమయమున అనేక దేశములలో అనేక నరావతారములుగా ఉన్నావు.)

**మాయాసతీ జీవ సుతావనాయ, భవా నభూ దత్రిజ! భక్తి దాస: ।**
**యధా సతీ పుత్ర సుఖాయ నిత్యం, ధనేషణా దాసమనా స్తథాఽహమ్ ॥**

(ఓ అత్రి నందనా! మాయ అను భార్యయు, జీవులను పుత్రుల యొక్క రక్షణము కొరకు నీవు భక్తి దాసుడవైనావు. అలానే నేనును నా భార్యా పుత్రుల రక్షణ సుఖము కొరకు ధనేషణకు దాసుడనైనాను.)

**కమల నయన మంభో జాత పీఠే నిషణ్ణం,**
**నళిన శర విదాహం తత్త్వ మేకం త్రిరూపమ్ ।**
**త్రిగుణ లస దుపాధి బ్రహ్మ సూత్రావలంబ్యం,**
**పరమ పురుష దత్తాత్రేయ మత్రాశ్రయామ: ॥**

(కమలనయనుడును, కమాలాసనుడును, కమల శరుని దగ్ధము చేసిన వాడును, మూడు రూపములలో నున్న ఒకే ఒక తత్త్వమును, త్రిగుణ ప్రకృతి ఉపాధిని ఆవేశించినప్పుడే ఉపాసించుటకు వీలుగా మూడు పోగుల జందెమును పట్టుకొని ధ్యానింపబడవలపినవాడును, పరమ పురుషుడగు శ్రీ దత్తాత్రేయుని ఇచ్చట ఆశ్రయించుచున్నాము.)

**బాలాతపాంశురుచి చేలాభిరామ మళి నీలాలక భ్రమ ముఖం,**
**కాలాంతకం స్వపద లోలాశ్రితార్తిహర మాలోక్య విశ్వవిభవమ్ ।**
**ఫాలాక్షి బింబ రుచి జాలానలక్షపిత లీలారవింద విశిఖం,**
**హాలాహలాంకగళ మాలీన భక్తి గణ మాలాంతరం భజగురుమ్ ॥**

(ఉదయ సూర్యుని కాంతి గల కాషాయ వస్త్ర ధారియును, నల్ల తుమ్మెదల వంటి ముంగురులు కలవాడును, కాలాంతకుడును, తన పాదములను ఆశ్రయించిన వారి బాధలను పోగొట్టువాడును, కనపడుచున్న యీ జగత్తే సంపదగా కలవాడును, లలాటనేత్రము యొక్క కాంతి జాలమునుండి పుట్టిన అగ్నిచే పద్మశరుడగు మన్మధుని

దహించిన వాడును, హాలాహల విషమును కంఠమందు గుర్తుగా కలవాడును, భక్తిలో లీనమైన భక్తులగు గణముల శ్రేణులందున్నవాడును, అగు దత్త గురువును భజించుము).

**స్మరామి దత్తం త్రిముఖాబ్జసుందరం, త్రిమూర్తి చిహ్నాద్వయశోభి షట్కరమ్ ।**
**నిషణ్ణ మౌదుంబర పాదపాంతరం, స్ఫురత్త్విషా తీర్ణమివాంశుమాలినమ్ ॥**

(మూడు ముఖ కమలములతో సుందరుడును, త్రిమూర్తుల చిహ్న ద్వంద్వములతో ప్రకాశించు ఆరు కరములు కలవాడును, తళ తళ మెరయు తేజస్సుతో ప్రకాశించుచు, మేడి చెట్టు మొదలులో కూర్చుండి, ఆ చెట్టు కొమ్మల మధ్య కనపడిన సూర్యుడు చెట్టు దిగి మొదలులో కూర్చున్నాడా! అన్నట్లు ఉన్న దత్తుని స్మరించుచున్నాను.)

**కాషాయ వర్ణ వసనం కమనీయ కాయం, కాదంబినీ రుచిర కాల జటా కపర్దమ్ ।**
**ఔదుంబర ద్రుమ ధరాతల వేదికాయాం, ధ్యానస్థితం భజ పరాత్పర దత్తదేవమ్ ॥**

(కాషాయ వర్ణ వస్త్ర ధారియు, అందమైన శరీరము కలవాడును, మేఘముల వలె నల్లగా ప్రకాశించు జటాజూటము కలవాడును, మేడి చెట్టు కింద స్థలములో అరుగుపై ధ్యానములోనున్న పరాత్పరుడగు దత్తదేవుని భజించుము.)

**కాషాయాంశు స్ఫురణవసనం కంజ కింజల్కవర్ణం,**
**జ్ఞానజ్యోతి: ప్రతిమవపుషా నిత్య జాజ్వల్యమానమ్ ।**
**భిక్షాపాత్రం కరకమలయో ర్బిభ్రతం బ్రహ్మదండం,**
**దత్తాత్రేయం భజభజ విధిం విష్ణు మీశం త్రిమూర్తిమ్ ॥**

(కాషాయరంగు కిరణములతో ప్రకాశించు వస్త్రమును ధరించిన వాడును, పద్మకేసరముల రంగు కలవాడును, జ్ఞాన జ్యోతియే విగ్రహముగా మారినట్లున్న శరీరము కలవాడును, నిత్యము ప్రజ్వరిల్లుచున్న తేజస్వియు, కరకమలములందు భిక్షాపాత్రయు బ్రహ్మదండము కలవాడును, బ్రహ్మ విష్ణు శివులను త్రిమూర్తులుగానున్నవాడును, అగు దత్తాత్రేయుని భజించుము భజించుము.)

**కాలాగ్నికీలేష్వపి పచ్యమానో, న ముంచతి స్మ స్వగుణం జనోఽయమ్ ।**
**తథాఽపి యత్న: క్రియతే హి నిత్యం, దత్త ! త్వయా సద్గురు దండపాణే! ॥**

(నరకమున అగ్ని జ్వాలలచే కాల్చబడినను, యీ జనులు తమ గుణములను

వదలకున్నారు. అయిననూ గురు స్థాయిలో దండమును ధరించిన దత్తా! నీవు నిరంతరము వారిని ప్రతి జన్మ తరువాత నరకమున దండించుచూ నీ ప్రయత్నమును చేయుచునేయున్నావుగదా)

**జ్ఞానాగ్నినా బోధయసిస్మ పూర్వం, కాలాగ్నినా త్వం దహసిస్మ పశ్చాత్ ।**
**న త్వం గురు ర్బాధక బోధకోఽసి, దత్తో భవా న్బోధక బాధకో హి ॥**

(నీవు ముందు జ్ఞానాగ్నితో బోధించెదవు. పిమ్మట మారకున్నచో కాలాగ్నితో కాల్చి బాధించెదవు. నీవు బోధ ద్వారా బాధించు గురువు కావు. నీవు ముందు బోధించి తరువాత మారకున్నచో బాధించు గురువువైయున్నావు.)

**యం భిక్షుక బ్రాహ్మణ వేషిదత్తం, నిధ్యాయ ధావంతి సమేఽపి దూరమ్ ।**
**న జానతేఽమీ తముదీరితైక- జృంభా సమావిష్కృత మేరుశైలమ్ ॥**

(యాచించు బ్రాహ్మణ వేషములోనున్న యీ దత్తుని చూచి దానభయముతో జనులు దూరముగా పరుగెత్తుచున్నారు. కానీ ఇతడు కేవలము ఒక్క ఆవులింత చేత బంగారు కొండయగు మేరు పర్వతమును సృష్టించినాడన్న విషయమును తెలయకున్నారు గదా!)

**కాషాయాంశుక! కామినీ భుజ సమాలంబోఽసి కామాతురో,**
**వేదాంతామృత వర్షవారిద! సురామత్తోఽసి విస్రస్తవాక్।**
**సత్త్వం భాతి రజ స్తమశ్చ భవతి త్రైగుణ్య వర్ణ త్రయం,**
**బోధాయాథ పరీక్షితుం శ్రితజనం దత్త! ద్విధా దృశ్యసే ॥**

(ఓ కాషాయవస్త్రధారీ! నీవు కామాతురుడవై కామిని యొక్క భుజముపై వ్రాలియున్నావు వేదాంతామృతమును బోధలతో వర్షించుచూ, త్రాగి పిచ్చి మాటలను మాట్లాడుచున్నావు. ఇట్లు సత్త్వముతోను, రజస్తమో గుణములతోను ప్రకాశించుచున్నావు. త్రిగుణములను యీ విధముగా ముందు జ్ఞానబోధ చేయుటకును, తరువాత ఆశ్రితులను పరీక్షించుటకును ఉపయోగించుచున్నావు. ఓ దత్తా! నీవు ఆచార్యునిగాను, పరీక్షకునిగాను రెండు విధములుగా కనపడుచున్నావు.)

**ఘన మోహ తమో నిరాస బోధం, స్ఫుట కాషాయపటం తనౌ దధానమ్ ।**
**ప్రణమామ్యుదయారుణాంశుమంతం, గురుదత్తం ధిషణాబ్జ సుప్తి బోధమ్ ॥**

(ఘన (గొప్ప లేక మేఘముల) మోహాంధకారమును పోగొట్టు జ్ఞానబోధయను కాంతి కలవాడును, స్ఫుటమైన కాషాయ వస్త్రమును శరీరము నందు ధరించి ఉదయకాల సంధ్యాకాంతితోనున్న వాడును, బుద్ధులను పద్మముల నిద్రను పోగొట్టు జ్ఞానమును చెప్పు గురుదత్తుని నమస్కరించుచున్నాను.)

**సంధ్యా భాస్వర వాససే గళ లస ద్రుద్రాక్ష మాలావతే,**
**జూటాజూట మనోహరాయ కనక చ్ఛాయాంగ వర్ణాయ చ ।**
**భిక్షాభస్త్రికయా భుజే శ్రుతివచ స్సారామృతాఽఽ వర్షిణే,**
**దత్తాత్రేయ యతీశ్వరాయ నతయ స్సాష్టాంగదండా ముహుః॥**

(సంధ్యవలె మెరయుచున్న ఎర్రని వస్త్రమును కట్టినవాడును, కంఠమునవిలసిల్లుచున్న రుద్రాక్ష మాల కలవాడును, జటాజూటముతో మనోహరుడును, బంగారు చాయ కలవాడును, భుజమున జోలెకలవాడును, వేదవాక్యముల సారాంశమను అమృతమును వర్షించువాడును అగు దత్తాత్రేయ యతీశ్వరునకు మాటి మాటికిని సాష్టాంగ ప్రణామములు.)

**తమేకదా దత్త మహానుభావం, స్నానాయ కాశీ మణికర్ణికాయామ్ ।**
**సమేత మద్రాక్ష మహం సకంపో, బ్రాహ్మే ముహూర్తే హ్యనుకంపయాఽస్య ॥**

(ఒకసారి బ్రాహ్మీ ముహూర్తమునందు కాశీ నగరములో మణికర్ణికా ఘట్టము నందు స్నానము కొరకు వచ్చిన ఆ దత్త మహానుభావుని, నా శరీరము కంపించుచుండగా, ఆయన అనుగ్రహము వలన చూడగలిగితిని.)

**అతీంద్రియానుభావాయ, సాంద్ర జ్ఞానార్ణవాయ చ।**
**దత్తాత్రేయ యతీంద్రాయ, నమ శ్చంద్రానుజాయ తే ॥**

(ఇంద్రియాతీతమైన తేజస్సు కలవాడును, ఘనీభవించిన జ్ఞానసముద్రుడును, చంద్ర సహోదరుడును, అగు దత్తాత్రేయ యతీంద్రునకు నమస్కారము.)

**భవానస్తీతి నాస్తీతి, పక్షయో రాద్య సమ్మతిః ।**
**అంధాగ్ర వహ్నివ చ్చైవ, స్మర్యతాం సంశయాత్మభిః ॥**

(నీవు ఉన్నావా? లేవా? అను రెండు పక్షములతో సంశయించు వారు కూడ నీవు

ఉన్నావను మొదటి పక్షమునే గ్రహించవలయును. గుడ్డివాడు ఎదురుగా అగ్ని ఉన్నదా? లేదా? అను రెండు పక్షములతో సంశయించినపుడు, అగ్ని ఉన్నది అని భావించి వెనుదిరుగుటయే ఉత్తమముగదా అని గుర్తించవలయును.)

**అనేకానూహ్యా లీలాభి:, జీవితానుభవే నృణాం ।**
**అస్తీతి స్థాప్యతే పక్ష:, పిత్రా పుత్రావనార్థినా ॥**

(తండ్రియగు దత్తుడు, పుత్రులగు జీవులను రక్షించుటకు వారి జీవితానుభవములలో అనేకములగు అనూహ్య లీలలద్వారా, అనూహ్యుడగు తానున్నానను పక్షమునే స్థాపించుచున్నాడు.)

**భేత్తారం హృదయగ్రంథే, ర్వేత్తారం శ్రుతిసద్గిరామ్ ।**
**ఛేత్తారం విత్తబంధాదే, రత్తారం జగతాం స్తుమ: ॥**

(హృదయగ్రంధిని భేదించువాడును, వేద వాక్యసార కోవిదుడును, ధనేషణాది బంధములను ఛేదించువాడును, జగత్తులను భక్షించువాడునగు దత్తుని స్తుతించుచున్నాము.)

**సత్తామాత్రమతం దత్తం, చిత్తోన్మత్త మివేక్షితమ్ ।**
**వందే హృత్తాప హృత్తత్త్వం, మత్తేభ గతి ముత్తమమ్ ॥**

(ఉన్నాడని మాత్రమే తెలియబడిన వాడును, పిచ్చివానిగ కనపడు వాడును, మత్తేభము వలె నడచువాడును, హృదయ తాపమును హరించు తత్త్వము కలవాడును అగు దత్తుని నమస్కరించెదను.)

**హే పద్మాసన ! హంసవాహన! నమో వేదార్ణవోత్పాదక!,**
**హేనారాయణ! నీరజేక్షణ! నమో నాగేంద్ర శయ్యాశయ! ।**
**హే గంగాధర! చంద్రశేఖర! నమో నందీశ్వరారోహణ!,**
**హేమూర్తిత్రయ వేష దత్త! సతతం త్వన్నామలోలం కురు ॥**

(ఓ పద్మాసనా! హంసవాహనా! వేద సముద్రములను సృష్టించినవాడా! నమస్కారము. ఓ నారాయణా! పద్మలోచనా! నాగేంద్రునిపై శయనించిన వాడా! నమస్కారము. ఓ గంగాధరా! చంద్రశేఖరా! నందీశ్వరుని ఆరోహించువాడా! నమస్కారము. ఓ త్రిమూర్తి వేషా! దత్తా! ఎల్లప్పుడును నీ నామస్మరణాసక్తునిగా నన్ను జేయుము.)

**కాలో ధావతి వాహినీవ సతతం కామీవ వామాతుర:,**
**కాలా మే దయితాలకా వికలితా: ఫేనద్యుతిం బిభ్రతి ।**
**కాలస్యాకలి కాలకింకరకులం దత్తం త మాయామి య:,**
**కాలాతీత మహామహేశ్వర పరబ్రహ్మాసనే రాజతే ॥**

(అందమైన స్త్రీ వెంటబడిన కాముకుని వలె యీ కాలము ఒక నదివలె నిరంతరము పరుగెత్తుచున్నది. ఆ నదియొక్క నురుగు యొక్క తెల్లని కాంతి నా భార్యయొక్క చెదరిన నల్లని ముంగురులయందు కనిపించుచున్నది. యముని యొక్క నల్లని కింకరులు కనబడుచున్నారు. ఈ సమయమున ఎవరు కాలాతీతమైన మహా మహేశ్వర పరబ్రహ్మ సింహాసనమున ఆసీనులైయున్నారో, అట్టి దత్తుని శరణము పొందుచున్నాను.)

**మార్జాలో రదనక్షతాంకిత మసౌ ముంచ న్ముహు ర్మూషికం,**
**గృహ్ణన్ క్రీడతి కంచిదేవ సమయం తం భక్షయత్యంతిమే।**
**రోగగ్రాహ విమోక్షణై: పశుగణై రేవం స దత్త ప్రభో! ,**
**కాల: ఖేలతి కాలకూట కబళం త్వాం కాలకంఠం వినా ॥**

(పిల్లి తన కోరలచే కొరికి విడచిన మూషికమును మరల పట్టుకొని మరల విడచుచు కొంతకాలము క్రీడించి చివరకు దానిని భక్షించును. అట్లే రోగ గ్రహణము, రోగ విమోక్షములు మాటిమాటికి జరుగుచుండగా జీవ పశుగణములతో కాలము కొంతసేపు ఆడుకొని చివరకు భక్షించును. అయితే కాలకూటమును మింగిన కాలకంఠుడైన ఓ దత్తప్రభూ! కాలము నీజోలికి మాత్రము రాదు.)

**జృంభతాం త్రిముఖ! జృంభతాం మహ, స్తావకం బహు ఖగోళ కందుకై: ।**
**యచ్చ ఖేలతి జని భ్రమ క్షయై, రంతరిక్ష తల ఖేలనాంగణే ॥**

(ఓ త్రిముఖా! నీ తేజస్సు విజృంభించుగాక, విజృంభించుగాక. అది జనన, భ్రమణ, ప్రళయములతో కూడిన అనేక ఖగోళలములను బంతులతో ఆకాశమను క్రీడాప్రాంగణమున ఆడుకొనుచున్నది.)

**స్నానాయ సౌఖ్యరతిచిత్తవశం ప్రవిష్టం,**
**సంసార సాగర మహోర్మి సమాగతం మామ్।**
**ఉడ్డీన మత్స్య మకరాస్య మహోగ్రధారా -**
**దంష్ట్రా విఖండిత మిమం కలయేహ దత్త! ॥**

(సంసార సాగర స్నాన మను సౌఖ్యమును కోరు మనస్సునకు లొంగి, ప్రవేశించి దాని గొప్ప అలలచేత కొట్టబడిన నేను, పైకి ఎగురు చేపల మరియు మొసళ్ళ క్రూరమైన పదును గల కోరల చేత ఖండింపబడియున్నాను. ఓ దత్తా! ఇట్టినన్ను చూడుము.)

**అత్రేయ దత్త! భవతో జగదావిరాసీ,**
**న్మాయేంద్రజాలమివ మాయి నరా ద్విచిత్రమ్ ।**
**మాయావికార నరజాతి కణోఽహ మస్మి,**
**బ్రహ్మేహ మిత్యపలపం స్తవ హాసహేతు: ॥**

(ఓ దత్తాత్రేయా! విచిత్రమైన యీ జగత్తు, మాయ ఇంద్రజాలము మాయికుడగు ఇంద్రజాలికుని నుండి వచ్చినట్లు నీ నుండి ఆవిర్భవించుచున్నది. ఈ ఇంద్రజాల భాగమైన నరజాతిలో ఒక కణమే నేను. "నేను దేవుడను" అను ప్రలాపము చేయుచు నీయొక్క మందహాసమునకు కారణమగుచున్నాను.)

**నాటకే తే జగత్యస్మిన్, క్రీడా నవ రసాలయే ।**
**అహంబ్రహ్మేతి జీవానాం, వాచో హాస్య రసోర్మయ: ॥**

(నీ వినోదము కొరకు నవరసములతో కూడిన యీ జగన్నాటకమును నీవు సృష్టించినావు. ఇందులో "నేను దేవుడను" అను జీవుల అద్వైత వాక్యములే హాస్యరసముయొక్క అలలు.)

**ఊహ్యోపాధి నరద్వారా, నోహ్యస్త్వం జ్ఞాన బోధక:।**
**అవతీర్ణో నిత్యసంగాత్, చిదాత్మేతి త్వముచ్యసే ॥**

(అనూహ్యుడైన నీవు ఊహ్యమైన నరాకార ఉపాధి ద్వారా అవతరించి జ్ఞాన బోధను చేయుచున్నావు. నీకు, నరోపాధికిని, నిత్యమైన యీ సంబంధము ద్వారా నరోపాధియగు చిదాత్మ ద్వారా నిన్ను పిలచుచున్నారు. అనగా - పండ్ల బుట్టను మోయు వానిని "పండ్లబుట్టా" అని పిలచినట్లుగా గ్రహించవలెను.)

**త్వాం నిత్య మనుయాత్యేవ, చిదాత్మోపాధి ర్రతతు ।**
**నానేనోపాధి మన్వేతి, భవానత్రైవ హి భ్రమ: ॥**

(నీవు అవతరించినప్పుడు యీ చిదాత్మ - ఉపాధి నిన్ను అంటిపెట్టుకొని ఉండును. కానీ నీవు ఆ ఉపాధిని అంటిపెట్టుకొని ఉండవు. కావున ప్రతి నరరూప చిదాత్మయు

నీవు కావు. ఇచ్చటనే అద్వైతులు భ్రమపడినారు.)

**ఊహ్యార్థ శబ్దచైతన్యా, దనూహ్యం భిద్యతే సదా ।**
**అద్వైతాంశాంశితాద్వైతా, న్యవాచ్యాని యథార్థత: ॥**

(ఊహ్య వస్తువులకే శబ్దములుండును కావున చైతన్య శబ్దము చేత చెప్పబడు ఆత్మ కన్న అనూహ్యమైన పరబ్రహ్మము ఎల్లప్పుడును వేరుగనే ఉండును. కావున ఆత్మకును పరబ్రహ్మమునకు మధ్య సత్య సంబంధము అద్వైతము అనికానీ, పూర్ణము - భాగము (విశిష్టాద్వైతము) అనికానీ, రెండు ఊహ్యావస్తువుల మధ్య చెప్పబడే ద్వైతము అని కానీ చెప్పలేము.)

**ఊహ్యానూహ్యతయా ద్వైతం, పూర్ణం తన్న చిదాత్మత: ।**
**అహంకారక్షయా త్రీణి మతాన్యుద్ధరణక్రమాత్ ॥**

(అనూహ్య - ఊహ్య భేదము కూడ ద్వైతమే. అయితే ఇందులో పరిపూర్ణ ద్వైతమున్నది. ద్వైతమతములో పరమాత్మ - జీవాత్మలకు చైతన్యతత్త్వమును అంగీకరించుట చేత పూర్ణద్వైతము రాలేదు. అయితే ఈ త్రిమతములు ఇట్లు ఏల చెప్పినవి అనగా - పూర్ణాహంకారులగు బౌద్ధమీమాంసకులకు చెప్పవలసినపుడు అద్వైతము చేత ఆకర్షించుట, అహంకారము కొంత తగ్గినపుడు పూర్ణ - భాగ సంబంధమును చెప్పి కొంత ద్వైతమును ప్రతిపాదించుట, అహంకారము బాగుగ తగ్గినపుడు కేవల చైతన్య మాత్రముగా అద్వైతమును మిగిల్చి మిగిలిన గుణములలో పూర్తి ద్వైతమును చెప్పుట అను మూడు స్థాయిలలో క్రమముగ జీవోద్ధరణములో ఆచార్యులు చెప్పిరి.)

**గంగాశీకర మౌక్తికై ర్గజశిరోభేదప్లుతై ర్వాఽర్చితం,**
**దత్తం జంతుకపర్యవేక్షణపరం కైలాసశైలాగ్రత: ।**
**జూటాజూట వికర్షితారుణ జటాజాలం మహాతాండవే,**
**పంచాస్యం ప్రణమామి పంచవదనం గర్జాట్టహాసం ముహు: ॥**

(గజాసురుడను గజమును చంపినపుడు దాని కుంభస్థలమును భేదించగా దానిలోనున్న ముత్యములు ఎగిరి మీదపడి అర్చించుచున్నవా అన్నట్లు ఉన్న తెల్లని గంగాజల బిందువులతో, ఇతర అల్పజంతువులు అను జీవులను కైలాస శైలాగ్రమునుండి పర్యవేక్షించుచున్నవాడును, తాండవము ఉద్ధృతమైన కారణమున జటాజూటము ఊడి ఎర్రని జటలు ఎర్రజాలుగా ఆవరించగా, మాటిమాటికి అట్టహాసగర్జనలతో నుండు

సింహము వలెనున్న పంచవదనుడైన శివదత్తుని నమస్కరించుచున్నాను.)

**కార్తిక్యాం బహులక్షదీపరుచిరా దత్తేశ దేవాలయా:,**
**దృశ్యంతే బహవో న కశ్చిదపి హా! దేహో విమోహామల: ।**
**యస్మిన్ జ్ఞాన మహాప్రదీప పరమజ్యోతి స్సదా దృశ్యతే,**
**భక్తిస్నేహ మనోదశా మయమిదం యేనోజ్జ్వలం వై జగత్ ॥**

(ఈ కార్తీక పూర్ణిమయందు లక్షల దీపములతో వెలుగు శివదత్తుని దేవాలయములు ఎన్నో కనపడుచున్నవి కానీ, జగత్తును దీపింప చేయు భక్తి తైలముతో మనస్సు అను వత్తి యందు వెలుగు జ్ఞాన మహా దీప పరంజ్యోతి నిత్యము కనపడు, మోహరహితమైన విమలమైన నర దేహమను దేవాలయము ఒక్కటి కూడ కనిపించలేదు.)

**మాసేఽస్మి న్నహి పుణ్యదేశగమనం ప్రఖ్యాత తీర్థేషు వా,**
**న స్నానం కృత మాలయాంతరగతి: పూజాకృతే వా కృతా।**
**దత్తస్యాత్ర కపర్దిన: ప్రతిదినం భిక్షాసమేతస్య మత్ -**
**వీక్షావర్త్మసు నీలలోహితమహో! నిత్యం యతో నృత్యతి ॥**

(ఈ కార్తిక మాసమునందు ఏ పుణ్యక్షేత్రమునకును పోలేదు. ఏ ప్రఖ్యాత తీర్థమునందును స్నానము చేయలేదు. పూజ కొరకు ఏ దేవాలయములోనికి పోలేదు. జటాజూటధారియగు శివదత్తుడు ప్రతిదినము భిక్షార్థము వచ్చినపుడు కనపడుచుండగ, ఆయన యొక్క నీలలోహిత తేజస్సు నా చూపుల వీధులలో నిత్యము నృత్యము చేయుచుండుటయే నా యీ ప్రవర్తనకు కారణము.)

**మీమాంసా ప్రథమా ప్రవక్తి సకలం కర్మైవ దైవంత్వితి,**
**బ్రాహ్మీ వక్తి పరా తదూహవిషయో నైవ క్రియారాడితి ।**
**తత్తత్కర్మఫలప్రదాయకవిధి ర్నిర్దిశ్యతే స త్వయా,**
**ధర్మో ధేనురపి శ్రితో భటఇవ వ్యాపారకృ ద్దత్త! తే॥**

(పూర్వమీమాంస "అంతయును కర్మ వశమే కావున కర్మయే దైవ" మనుచున్నది. ఉత్తరమీమాంస, "ఆ దైవము ఊహలకందనిది, కర్మ దైవ వశమే" అనుటయే నిజము. ఏలనన ప్రతి ఫలము కర్మాధీనమైయున్నది. అయితే ఆ కర్మ వ్యవస్థ అంతయును నీ ఆజ్ఞచే శాసించబడుచున్నది. ఈ కర్మస్వరూపమగు ధర్మదేవతయును గోవురూపమును

ధరించి నీ సేవకునిగా పనులను చేయుచున్నది గదా!)

**యం బ్రహ్మేతి మహర్షయో హరిరితి శ్రీవైష్ణవా యం శ్రితాః,**
**యం సాక్షా త్పరమేశ్వర శ్శివఇతి ధ్యాయంతి శైవా స్సదా।**
**దత్తాత్రేయ ఇతి స్మరామి తమహం సృష్టిస్థితిధ్వంసదం,**
**బ్రహ్మాండస్య గుణక్రియాత్రివదనం బ్రహ్మేతి వేదై ర్మతమ్ ॥**

(ఎవరిని బ్రహ్మదేవునిగా మహర్షులును, ఎవరిని హరియని శ్రీ వైష్ణవులు ఆశ్రయించినారో, ఎవరిని శైవులు పరమేశ్వరుడైన శివునిగా నిత్యము ధ్యానింతురో, అట్టివానిని నేను దత్తాత్రేయునిగా స్మరించెదను. అతడే జగత్తు యొక్క సృష్టి స్థితి ధ్వంసములను చేయుచు త్రిగుణముల త్రికర్మలను సూచించు త్రివదనములతో, వేదములచే బ్రహ్మమని భావించబడుచున్నాడు.)

**బాహ్యోపాధి స్త్రిమూర్తిశ్చ, ధార్యమాణాంశుక త్రయమ్ ।**
**దత్తాత్రేయోఽంతరాత్మాహి, పరబ్రహ్మాఖ్యధారకః ॥**

(త్రిమూర్తులను ధరించబడు మూడు వస్త్రములును బాహ్యోపాధియే. అంతారాత్మయగు దత్తాత్రేయుడు, ఆ మూడు వస్త్రములను ధరించువాడగు పరబ్రహ్మము.)

**యేన వేగేన కాలోఽయం, ధావతీహ న మే భయమ్ ।**
**తేన వేగేన మృత్యు ర్మాం, సమేత్యేతద్ధి మద్భయమ్ ॥**
**క్రీడాకారా హి ధావంతో, వినోదాయ సమీక్షితాః ।**
**ధావత్కాల వినోదస్త్వం, దత్త ! మృత్యుంజయ ! ప్రభో ! ॥**

(ఈ పరుగెత్తుచున్న కాలమును గురించి నాకు భయములేదు. ఈ కాలము యొక్క వేగముతో మృత్యువునన్ను, సమీపించుచున్నది. అదే నా భయము. పరుగెత్తుచున్న క్రీడాకారులను చూచి జనులు వినోదించెదరు. అదే విధముగా, ఓ దత్తా! ప్రభూ! మృత్యుంజయుడవైన నీవును యీ పరుగెత్తుచున్న కాలమును చూచి వినోదించుచున్నావు. మృత్యుభీతుడగు నేను వినోదించలేను.)

**పాపాన్యనూహ్యాని కృతాని దత్త!, క్షమామపి ప్రార్థయితుం న ధైర్యమ్ ।**
**త్వమేవ కారుణ్య మకారణం మే, భిక్షాం ప్రదాయావసి చే త్కృతార్థః ॥**

(ఓ దత్తా! అనూహ్యములగు పాపములను చేసియున్నాను. వాటిని క్షమించమని ప్రార్థించుటకును ధైర్యము చాలకున్నది. నీవే నీ అపారమైన కారణములేని కరుణనుండి కొంచెము నాకు భిక్షపెట్టి రక్షించినచో, నేను కృతార్థుడనగుదును.)

**సంకటేషు సమేతేషు, దుర్నివార్యేషు కైరపి ।**
**దత్తాత్రేయ! భవానేవ, భవానేవ గతిర్మమ ॥**

(ఎవరికిని నివారింప నలవికాని మహా సంకటములు వచ్చినపుడు ఓ దత్తాత్రేయా ! నీవే నాగతి. నీవే నాగతి.)

**జగత్సృష్టి స్థితి ధ్వంస, హేతుం స్వం త్రిముఖై ర్వదన్ ।**
**త్వమనూహ్య పరబ్రహ్మ, వ్యక్త మేవ ముపాధినా ॥**

(నీ త్రిముఖముల ద్వారా జగత్తు యొక్క సృష్టి స్థితి లయములను నీవే చేయుచున్నావని తెలుపుచూ, ఈ విధముగా ఉపాధిద్వారా, అనూహ్య పరబ్రహ్మమగు నీవు వ్యక్తమైనావు.)

**త్వమేవ దాతాఽ ప్యహమేవ యాచకో, భవామి దత్త! ప్రతి జన్మని ప్రభో! ।**
**ఫలప్రదా కాఽపిచ యాచనా భవే, దిత: పరం కింను మనోహరం ప్రియమ్? ॥**

(ఓ దత్త ప్రభూ! ప్రతి జన్మలోను, నీవు దాతగాను నేను నీయాచకునిగాను ఉండవలెను. నేను కోరు ప్రతియాచనయును ఫలించును కావున ఇంతకన్న మనోహరమగు ప్రియము వేరేమున్నది?)

**దత్తశబ్దేన తేనైవ, దదాతి కిమపీప్సితమ్ ।**
**ఇతి సూచయతి స్వామీ, పితా రాజా గురుర్భవాన్॥**

(ఏది కోరినను, దానిని ఇచ్చువాడే దత్తుడని ఆ శబ్దము చేతనే స్వామియు, తండ్రియు, రాజు, గురువు అగు నీవు సూచింపబడుచున్నావు.)

**బ్రహ్మానందమహోదధి: శ్రుతివిదాం పోప్లూయమానార్థినాం,**
**హంసానాం ప్రణవామృత హ్రదతలప్రోత్థానధాటీమతామ్।**
**ఊహాతీత పరాత్పర స్థితి మహాతత్త్వ క్రియావ్యంజకో,**
**దత్తేత్యక్షరయో రయం హి మహిమా కేనాపి నో వర్ణ్యతే ॥**

(ఓంకారామృత సరోవరము నుండి పైకి వేగముగా లేచి యాదుటకు కోరికగల వేద వేత్తలగు పరమహంసలకు బ్రహ్మానంద సముద్రమును, అనూహ్యమైన బ్రహ్మము యొక్క స్థితియందు చేయ బడు మహా క్రియలగు జగత్సృష్టి స్థితి లయములను సూచించునదియు, అగు దత్త అను రెండు అక్షరముల యొక్క మహిమను ఎవరును వర్ణించలేరు.)

**మృత్యుదేవ! వినతి ర్నతే: పరం, శ్రూయతాం చ నచికేతసో గురో !**
**యస్త్వవేద్యవిదిత స్త్వయేరితో, దత్త ఏష విదితో హ్యుపాధినా ॥**

(ఓ మృత్యుదేవా! నచికేతసుని గురూ! నమస్కారానంతరము నీకు వినతిని చేయుచున్నాను. "పరమాత్మ తెలియరాని వాడని తెలిసినది" అని నీవు చెప్పిన ఆ పరమాత్మ, ఉపాధి ద్వారా వ్యక్తమై దత్తునిగా తెలియబడినాడు గదా.)

**శ్రీ దత్తాత్రేయ ఏకో హి, జగత్పరమపావన: ।**
**యస్యాగ్రేఽప్యాగమా: పూతా, అపవిత్రశ్వరూపిణ: ॥**

(ఈ జగత్తులో పరమపావనుడు శ్రీ దత్తాత్రేయుడు ఒక్కడే. ఏలననగా ఆయనముందు పరమపావనములగు వేదములు సైతము, అపవిత్రములగు కుక్కలుగా కనపడుచున్నవి!)

**అస్మాక మపి కాలోఽయం, సామీప్యం సముపాగత: ।**
**దత్తాత్రేయస్య సాయుజ్యం, వయం చ కవచం శ్రితా: ॥**

(మాకు కూడా కాలము సమీపించుచున్నది. మేము కూడ దాని నుండి రక్షణ పొందుటకై, శ్రీ దత్తాత్రేయుని సాయుజ్యము అను కవచమును ధరించినాము.)

**ఆత్రేయం బ్రాహ్మణం వన్దే, పాణి దర్భ కమండలుమ్ ।**
**వృతం పరశురామేణ, విష్ణుదత్తేన చాపరే ॥**

(చేతుల యందు దర్భలు, కమండలమును కలిగి, పరశురాముని చేతను విష్ణుదత్తుని చేతను, అపర క్రియలందు పురోహితునిగా వరింపబడిన ఆత్రేయ గోత్రుడగు బ్రాహ్మణుని అనగా దత్తుని నమస్కరించుచున్నాము.)

దత్తాత్రేయ! భవద్దయార్ఘురఘుషం మామత్తు మేతేబకా:,
కామక్రోధమదాదయో బకశమా స్తిష్ఠన్తి వేగగ్రహా : ।

కాలో వా బడిశామిషేణ విషయానందేన కర్షత్యయం,
పాతుం మాం భవదీప్సితం నను వినా కించి న్న శక్నోతి హి ॥

(ఓ దత్తాత్రేయా! నేను నీ కరుణా రసప్రవాహమునందు సంచరించు చేపను. నన్ను భక్షించుటకు యీ కామక్రోధమదాది దుర్గుణములు మునుల వలె శాంతముగా నటించుచు చేప కనబడగనే ఒడిసి పట్టుకొను కొంగలవలె సిద్ధముగానున్నవి. ఒక వేళ, వీటిని తప్పించుకొన్ననూ, కాలుడు విషయానందమును ఎరగా వేసిగాలముతో నన్ను పట్టుకొని లాగుటకు సిద్ధముగనున్నాడు. కావున యీ పరిస్థితులలో నన్ను కాపాడుటకు నీ సంకల్పమునకు తప్ప దేనికిని శక్తిలేదు.)

అస్మద్భాగ్య పరంపరా పరిణతే స్సాక్షా త్పరబ్రహ్మ యో,
య స్సర్గస్థితి నాశ కారణముఖై ర్బ్రహ్మాండ కుండీతతే: ।
యశ్చైకో జగదాశ్రయ: పరిమితాకారో ఽ ప్యనూహ్యోఽస్తి యో,
దత్తాత్రేయ ముపాస్మహే త మనఘా మంకే వహంతం ప్రియామ్ ॥

(మా అదృష్టముల పరంపర పండినందున, ఎవరు సాక్షాత్తుగా పరబ్రహ్మమో, ఎవరు బ్రహ్మాండములను కుండలయొక్క సృష్టి స్థితి లయములకు కారణములైన మూడు ముఖములు కలవాడును, ఎవరు ఒక్కరే యీ సమస్త జగత్తుకు ఆధారముగానుండియు, పరిమితాకారుడై యుండుటవలన ఊహలకు అందుటలేదో, ప్రియమైన అనఘాదేవి అంకముపైనున్న వాడగు అట్టి దత్తాత్రేయుని ఉపాసించుచున్నాము.)

అష్టసిద్ధి తనయై స్సమన్వితం, స్వీయదేవ్యనఘయా సమాశ్రితమ్ ।
దత్త దేవమపి సత్కుటుంబినం, భావయామి గృహిణం గృహిహ్యామ్ ॥

(అష్ట సిద్ధులను పుత్రులతో కూడిన వాడును, తనదేవియగు అనఘచే ఆశ్రయింప బడినవాడును, సత్కుటుంబముతో కూడిన గృహస్థుడగు దత్తదేవుని భావించుచున్నాను. నేను కూడా గృహస్థుడనే కదా.)

జగదాకాశపర్యంతం, మాయామయ మిదంజగత్।
క్వ మాయా త్వాం వినా దత్త!, క్వ సిద్ధిశ్చ వినా జగత్?।
మాయా మాశ్రిత్య సిద్ధీనాం, ప్రభవ స్త్వత్త ఏవ హి ।
ఇత్యర్థస్య గృహస్థస్య, తాత్పర్యం తర్కయామి తే ॥

(ఆకాశముతో సహా యీ జగత్తు అంతయు మాయయే. ఈ జగత్తు లేనిచో అష్టసిద్ధులు లేవు. నీవులేనిచో మాయలేదు. సిద్ధులు మాయను, మాయ నిన్నును, ఆధారము చేసుకున్నవి. కావున పుత్రులు తల్లిని, తల్లి నీమీదను, ఆధారపడియున్నారు. ఈ విధముగా నీ గృహస్థాశ్రమ తాత్పర్యమును భావించుచున్నాను.)

**మాయా త్వత్ప్రభవా పుత్రీ, వినోద రమణీ సతీ ।**
**బ్రహ్మణ శ్చరితం మూఢై:, కైశ్చి దాక్షిప్యతే ఖలై: ।**
**వాయుయంత్రం విదా సృష్టం, రమతా వాయుసేవయా ।**
**పితా భర్తా సకింతస్య?, కేవలం కర్తృభోక్తృత: ॥**

(ఒక విజ్ఞాని, వాయువునిచ్చు యంత్రమును నిర్మించి, అది చేయు వాయుసేవచేత రమించుచున్నాడు. ఇంత మాత్రమున అతడు ఆ వాయు యంత్రమునకు తండ్రియు, భర్తయు అగుచున్నాడా? అతడు కేవలము దాని నిర్మాత, దాని సేవను వినోదించువాడే కదా. అట్లే యీ జగద్రూపమైన మాయాశక్తి నీకు కూతురు, భార్యయు అనరాదు. ఇది కేవలము కొందరు మూర్ఖులు బ్రహ్మను అక్షేపించుటయే.)

**ఆత్రేయదత్త! మునివంశ సుధాపయోధి -**
**రాకేందుబింబ! రమణీయ రస స్వరూప! ।**
**కం వా మదీయ కమనీయ కవిత్వకన్యా!,**
**లోకైకనాయకవిభో! వృణుతే త్వదన్యమ్? ॥**

(ఓ దత్తాత్రేయా! ఋషి వంశ సుధా సముద్రము నుండి సంభవించిన పూర్ణచంద్రా! రమణీయ రసస్వరూపా! ఓ లోకైకనాయకా! విభూ! నిన్ను వదలి వేరొకరిని నా కవిత్వ కన్య ఎవరిని వరించగలదు?)

**విశ్వాసప్రతిరూప వేదశునకై ర్ధేన్వా చ ధర్మశ్రియా,**
**స్రక్కుండీ డమరుత్రిశూల మమలై శ్శ్రీ శంఖచక్రం కరై: ।**
**సాక్షాద్బ్రహ్మహరీశ్వరత్రివదనై ర్వేదాంతసద్బోధకం,**
**త్వామేవ ప్రణమామి దత్త! సతతం సత్సంగ సంతోషిణమ్ ॥**

(విశ్వాసరూపములైన వేద శునకములతో, ధర్మదేవతయగు ధేనువుతో, చేతులతో మాలా కమండలు డమరుక త్రిశూల శంఖ చక్రములను ధరించి, సాక్షాత్తు బ్రహ్మ విష్ణు శివ

త్రిముఖములతో వేదాంత బోధలనుచేయు, సత్సంగ సంతోషియగు దత్తా! నిన్నే ప్రణమిల్లుచున్నాను.)

**ఇదం మమేతి ప్రవిజల్పవత్యాం, గచ్ఛ ద్గమిష్య ద్గత జీవకోట్యామ్ ।**
**కేనాపి కించి న్నహి నీత మత్ర, సర్వం స్థిరం దత్తధనం జగద్యత్ ॥**

(ఇది నాదియను వాగుడు కలిగి, నడచుచున్న, నడువబోవు, నడచినట్టి యీ జీవలోక కోటిలో, ఎవరును ఏమియును ఇచట నుండి తీసుకొని పోలేదు. ఏలననగా, యీ సమస్త జగత్తు, దత్తుని యొక్క స్థిరాస్తి రూపమైన ధనము.)

**నామాక్షరాణి చత్వారి, దత్తాత్రేయేతి జీవినామ్ ।**
**ధర్మార్థకామమోక్షాణాం, చతుర్ణాం సత్ఫలాని హి ॥**

(దత్తాత్రేయ అను నాలుగు నామాక్షరములు జీవులయొక్క ధర్మార్థ కామ మోక్షములనెడి చతుర్వర్గముల యొక్క సత్ఫలములే.)

**దత్తాత్రేయ! నమోనమో஽స్తు భవతే భూయో నమస్తే నమో,**
**భూయోఽపి ప్రణతి: పున: పునరిదం సాష్టాంగదండం నమ: ।**
**త్వత్సేవా పరమాణు రేవ హి కృతా శక్త్యా తవైషా మయా,**
**దత్తం తత్ఫల మద్రి రేవ భవతా త్వద్దక్షిణా హ్యద్భుతా ॥**

(ఓ దత్తాత్రేయా! నీకు నమస్కారము, నమస్కారము. మరల మరల నీకు నమస్కారము. నీకు సాష్టాంగ దండ ప్రణామము. నీ శక్తి వల్లనే నీకు నేను చేసిన సేవ పరమాణు మాత్రమే. ఆ సేవకు నీవు మెచ్చి కొండంత ఫలమును ఇచ్చినావు. నీ కరుణ అద్భుతము కదా.)

**త్రిముఖ త్రిగుణో జీవ:, షడ్వికార కరం వపు: ।**
**తాభ్యాం దత్తం పరబ్రహ్మ, నోహ్య మూహ్యోపధీక్షితమ్ ॥**

(త్రిముఖములే త్రిగుణములు. షడ్వికారములే ఆరు చేతులు. ఈ విధముగా సూక్ష్మ స్థూల శరీరములు సూచింపబడుచున్నవి. ఈ విధమైన ఊహించుటకు వీలగు ఉపాధి ద్వారా అనూహ్యమైన పరబ్రహ్మము దత్తమై కనపడుచున్నది.)

**ఉదుంబర తరో రధ స్థితమనంగ కోటిత్రయ-**
**స్వరూప నవ మోహనం శ్రుతి సదర్థ సందర్శకమ్ ।**
**కషాయరుచిరాంశుకం సునికషోఫలం చార్థినాం,**
**స్మరామి ముని శేఖరం త్రిముఖ మత్రివంశోద్భవమ్ ॥**

(మేడిచెట్టు కింద ఆసీనుడైన వాడును, మూడు కోట్ల మన్మధుల అందముతో నవమోహనుదును, వేదముయొక్క సత్యార్థమును ప్రదర్శించువాడును, ప్రకాశించు కాషాయవస్త్రధారియును, ఆశ్రయించిన భక్తులను పరీక్షించుటలో గీటురాయి యైన వాడును, త్రిముఖుదును, అత్రి వంశసంభవుదును అగు మునిశేఖరుడైన దత్తుని స్మరించుచున్నాము.)

**బ్రహ్మవంశ జలధే స్సముత్థితం, పూర్ణ చంద్ర తిధి కాల సంభవమ్ ।**
**చంద్రబింబ వదన త్రయోజ్జ్వలం, చంద్రసోదర ముపాస్మహే వయమ్ ॥**

(బ్రాహ్మణ వంశ సముద్రము నుండి ఉద్భవించినవాడును, పూర్ణచంద్రుని తిధి కాలమున జన్మించినవాడును, మూడు చంద్రబింబముల వంటి ముఖములతో ప్రకాశించువాడును, చంద్రసోదరుడగు దత్తుని ఉపాసించుచున్నాము.)

**గురోదత్త! ప్రభోదత్త!, శ్రీదత్తేతి స్మరంతి యే ।**
**రమంతే విలపంతోఽపి, జగన్నాటక వేషిణః ॥**

(ఎవరు గురుదత్తా! ప్రభుదత్తా! శ్రీదత్తా! అని స్మరించుచున్నారో అట్టి వారు యీ జగన్నాటకమున తాము వేషధారులమని తెలుసుకొని, కష్టములలో ఏడ్చునపుడు కూడా రమించెదరు.)

**దత్త స్సద్గురుమందరః శ్రుతిరపి క్షీరార్ణవ శ్చాశ్రితాః,**
**దేవా జ్ఞానిన ఐహికా దితిసుతా స్తద్భక్తిభావః ఫణీ ।**
**తత్సేవా మధనభ్రమః క్షయకరో భోగస్తు హాలాహలం,**
**తద్యోగోఽప్యమృతం సుదర్శన మిదం ఛాయామతచ్ఛేదకమ్ ॥**

(దత్త సద్గురువు మందర పర్వతము. వేదమే క్షీర సముద్రము. జ్ఞానులే ఆశ్రయించిన దేవతలు. ఐహిక వరములను కోరువారే రాక్షసులు. దత్త భక్తి భావమే శేషుడు. దత్త సేవయే సముద్ర మధనము. నాశము చేయు భోగములనిచ్చు వరములే హాలాహలము.

దత్త యోగమే అమృతము. తామస మతములను ఛేదించు యీ సుదర్శనమే (మంచిమతమే) సుదర్శన చక్రము.)

**పశుజన్మ భవిష్య మేవ యోగ్యం, సతతాహార సుషుప్తి మైధునస్య ।**
**యదహేతు దయా తవాస్తి దత్త!, ప్రభవేయం మనుజ: పున:పునర్వా ॥**

(ఓ దత్తా! నిరంతరము ఆహార నిద్రామైధున రతుడగు నాకు రాబోవు జన్మ పశుజన్మయే సరియైనది. కానీ నీ అకారణ కరుణ వలన నేను మరల మరల మానవ జన్మలనే పొందవచ్చునుగదా.)

**గురో! గురూణా మపి దత్త సద్గురో!, మహోదధే స్తారయ సంకటోత్కటాత్ ।**
**న తే హ్యసాధ్యం కిమపి ప్రభో! యత:, త్వదీయ సంకల్ప మయం జగత్త్రయమ్ ॥**

(గురువులకు గురువైన దత్త సద్గురూ! ఉత్కటమైన యీ సంకట సముద్రము నుండి దాటించుము. ఓ ప్రభూ! నీకు అసాధ్యము ఏది లేదు. ఏలననగా యీ సమస్త జగత్త్రయము నీ సంకల్ప మాత్రమే కదా!)

**అహం మహాపాపమయోఽపి దత్త!, త్వమప్యసి శ్లాఘ్యతమ: పవిత్ర: ।**
**దయాం మయి స్థాపయసి త్వదీయాం, కింకారణం? వారణవ చ్చరామి ॥**

(నేను మహా పాప మయుడైననూ, నీవు పరమ శ్లాఘ్య పవిత్రుడవైననూ, దత్తా! నా యందు నీ దయను స్థిరముగా స్థాపించినావు. దీనికి కారణమేమి? అయిననూ నేను ఇంకనూ ఏనుగు వలె విచ్చలవిడిగానే సంచరించుచున్నాను.)

**భూమిం భేత్తి హలేన కర్షకవరో వర్షప్రపాతోక్షితాం,**
**బీజన్యాసఫలోపపత్తికలయా హ్యేవం గురో! దత్త! మే ।**
**బుద్ధిం భింది వచోభి రాత్మకరుణా సిక్తాం చ తత్త్వార్పణాం,**
**నిర్వాణాంత ఫలేచ్ఛయా భవతి త త్కృష్ణాభిధానం ప్రభో!॥**

(కర్షకుడు నాగలితో వర్షముతో తడిసిన భూమిని దున్ని, బీజములను నాటి పంటను పండించుచున్నాడు. అట్లే, ఓ గురుదత్తా! నా బుద్ధిని నీ ఉపదేశములతో దున్ని, నీ కరుణచేత తడిపి, తత్త్వమును నాటి, నిర్వాణమను అంతిమ ఫలమును ప్రసాదించనెంచినావు కావున నీకు ఓ ప్రభూ! కృష్ణుడను పేరు కలిగినది.)

**ఆజాను పర్యంత పురాణ వస్త్రం, కక్ష్యాంతర స్థాపిత దర్భపుంజమ్ ।**
**హస్తాంబుపాత్రం ఘన ధూళి పాదం, తం యాచక బ్రాహ్మణ దత్త మీడే ॥**

(మోకాళ్ళవరకు చాలీచాలని పాత ధోవతి కట్టి, చంకలో దర్భకట్టను కలిగి, చేతిలో నీటి చెంబుతో, బాగాదుమ్ము పట్టిన పాదములతో యాచన చేయు బ్రాహ్మణుని వలె కనిపించు దత్తుని, స్తుతించుచున్నాను.)

**రామకృష్ణాదయో లోకే, పూజ్యంతే స్వర్ణ భూషణా: ।**
**యాచకై ర్యాచకే దత్తే, దృష్టే తేఽపి పలాయితా: ।**
**దానే దత్తస్య తేనైవ, పరీక్షార్థం తథేక్ష్యతే ।**
**అన్యథాఽయం ప్రభుస్త్వేక - జృంభావిష్కృత మేరుక: ॥**

(లోకములో బంగారు భూషణములు కల రామకృష్ణాది దేవతలు ధనమును యాచించు యాచకుల చేత పూజింపబడుచున్నారు. తమనే యాచించు దత్తుడు యీ యాచక వేషములో కనపడగనే పరుగెత్తుచున్నారు. తాను నీకు ఇచ్చిన ఐశ్వర్యమునుండి తనకు దానము చేయుదువా? లేదా? అని పరీక్షించుటకై దత్తుడు యాచక రూపములో కనపడుచున్నాడు కానీ, నిజముగా, ఆయన ఒక్క ఆవులింత చేత బంగారుకొండయగు మేరు పర్వతమునే సృష్టించినవాడు కదా!)

**దత్తాత్రేయ మహంవందే, సుందరం మందహాసిభి:।**
**కుందారవిందసందోహ-స్పందానంద ముఖేందుభి:॥**

(తెల్లని చిరునవ్వుతో కూడిన ఎర్రని ముఖములు అను చంద్రబింబముల నుండి వెలువడు మల్లెలు, పద్మముల కాంతుల సమూహములందు చిందెడి ఆనందముతోనున్న దత్తాత్రేయుని నమస్కరించుచున్నాను.)

**శ్రీదత్త పండితం పశ్య, ఖండిత ప్రతిపక్షకమ్ ।**
**బ్రహ్మాండాఖండలం జ్యోతి-శ్చండ మండల మండితమ్ ॥**

(ప్రతిపక్ష మతములను ఖండించువాడును, బ్రహ్మాండమునకు ఇంద్రుడును, తీవ్రమైన తేజశ్చక్రముతో అలంకరించబడినవాడును అగు శ్రీ దత్త పండితుని చూడుము.)

**ఉన్మత్త ప్రేమరాశి ర్నిగమ వచన స తత్త్వ బోధైక భాను:,**
**భక్తార్థం ప్రాణదాతా భువన ఖలజన ప్రాణ వాతాపనేతా ।**
**ధర్మాధర్మా దతీతో నిజ చరణ నమ ద్ధర్మ గోపాలనైకో,**
**దత్తాత్రేయ శ్శరణ్యో మమ హృదయ సరో లోల హంసో వరేణ్య:॥**

(పిచ్చి ప్రేమరాశియును, వేదవచనముల యొక్క సత్యార్థమును బోధించు ఏకైక సూర్యుడును, భక్తుల కొరకు ప్రాణములనే ఇచ్చువాడును, లోకములోని దుర్మార్గుల ప్రాణవాయువులను లాగివేయువాడును, తన పాదములయందు తలను వంచిన గోరూపమున నున్న ధర్మదేవతను రక్షించగల ఒకే ఒక సమర్థుడును, నా హృదయ సరోవరమునందు క్రీడించు శ్రేష్ఠమైన హంసయగు శ్రీ దత్తాత్రేయుడే నాకు శరణ్యుడు.)

**కనిష్ఠం యస్య లీలాయాం, ఫలం జ్ఞాతు మనుగ్రహమ్ ।**
**న శక్నోతి మతిస్తబ్ధో, భక్తో దత్త స్స వేద్యతే ॥**
**అస్మాక మేక రూప్యంతు, లక్ష రూప్యాణి తస్య వై ।**
**ఫలేన సహ శక్తిశ్చ, ఫల భోగాయ యాచ్యతామ్ ॥**

(ఎవరి సామాన్య లీల యందు, ఆయనకు అంతకన్న తక్కువ చూపుటకు వీలుకాని అనుగ్రహమును ఆయన చూపించినపుడు, ఆ ఫలమును తెలుసుకొన్నపుడు భక్తుడు తట్టుకొనలేక అతడి మతి స్తంభింపబడునో, ఆయనయే దత్తుడని తెలియ చెప్పబడుచున్నాడు. మన భాషలో ఒక రూపాయి, ఆయన భాషలో లక్ష రూపాయలు కావున ఆయనను ఫలమును యాచించునపుడు, ఆ ఫలమును అనుభవించగల శక్తిని కూడ ఇమ్మని యాచించవలెను.)

**అక్షరాణి హి చత్వారి, దత్తాత్రేయేతి జీవిన: ।**
**రథాశ్వా ఇవ కృష్ణస్య, గమయంత్యక్షరం సుఖమ్ ॥**

(దత్తాత్రేయ అను నాలుగు అక్షరములు, కృష్ణ రథమునకు కట్టిన నాలుగు అశ్వముల వలె జీవులను అక్షరమైన సుఖమునకు చేర్చును.)

**చిద్విద్యు చ్చల ధాన్య పేషణ మహాయంత్రం జడో మానవ,**
**స్తద్యంత్ర వ్రజ చాలకో నరవరో దత్త స్స్వతంత్ర: ఖలు ।**
**సా విద్యు జ్జడశక్తి రేవ జడయంత్రద్వ్యరూపాంతరా,**
**చిచ్ఛక్తి శ్చ తథాఽపి నాన్య దుపమా లోకేఽస్తి దత్తస్య తే ॥**

(ఈ మానవుడు చైతన్యమను విద్యుచ్ఛక్తితో నడచుచూ, ధాన్యమును గ్రహించి పిండి చేయు ఒక మరయంత్రమైన జడమే. ఇటువంటి అనేక యంత్రములను నడపుచున్న స్వతంత్ర మానవుడే దత్తుడు. విద్యుత్తు జడ శక్తియే. జడలోహముతో నిర్మించబడిన యంత్రముల పదార్థమైన జడ ద్రవ్యము జడశక్తి యొక్క రూపాంతరమే. అట్లే చైతన్యము కూడా నిజముగా జడశక్తియే. ఈ చైతన్యమును కూడా దత్తుడగు నీతో పోల్చుటకు వీలుకాని ఎడల ఇక లోకములో నీతో పోల్చగల ఉపమానమే లేదు.)

**జ్ఞాన న్యాసా ద్విశద విషయే విస్తరా ద్దోషదండాత్,**
**స్పర్ధాఽభ్యాసా త్సశమ మననా న్నిద్రయా సారయోగాత్ ।**
**త్రైగుణ్యార్థం గురువరగురుం వేద సంవేష్టితాంఘ్రిం,**
**దత్తాత్రేయం భజ భజ భజ బ్రహ్మవిష్ణ్వుగ్రరూపమ్ ॥**

(జ్ఞానబోధయు, స్పర్ధతో కూడిన విద్యాభ్యాసము రజోగుణ బ్రహ్మతత్త్వము. ఆ జ్ఞానమును విశద పరచుటకు విపులముగా చెప్పుట, ఓర్పుతో మననము చేయుట సత్త్వగుణ విష్ణుతత్త్వము. ఆ జ్ఞానమును ఆచరించుటలో తప్పు చేయుటలో దండనము, నిద్రించు బుద్ధికి బలము పెంచుటయు తమోగుణ రుద్రతత్త్వము. ఇట్లు త్రిగుణములను గురు స్వరూపమున ఉపయోగించుచు గురువరులకును గురువైన దత్తాత్రేయుని భజించుము. భజించుము. భజించుము.)

**ఝష ఇవ బడిశాగ్రే మత్తహస్తీవ గర్తే;**
**విషయ వలయ బద్ధో మాయయా కర్షితోఽహమ్ ।**
**స కరుణ మయి దత్తాత్రేయ దేవాత్ర మోక్షం,**
**ప్రదిశ దశ దిశాం త్వం హ్యేకదృశ్యో దృశాం మే ॥**

(బడిశయందున్న ఎరకొరకు చిక్కిన చేపవలె, గుంటయందు పడిన మత్త గజమువలె, మాయచేత ఆకర్షింపబడి, యీ విషయ వలయమునందు బద్ధుడనై యున్నాను. ఓ దత్తాత్రేయదేవా! నీవు దయతో నాకు ఇచట ముక్తినిమ్ము. దశదిక్కులయందును ప్రసరించు నా దృష్టులకు నీవే ఏకైక గతిగా కనపడుచున్నావు.)

**మద్యోన్మదాయ విచలారుణ లోచనాయ, గర్జ చ్చతు శ్శునక సంభ్రమ సంవృతాయ ।**
**దత్తాయ మత్త వచసే గురుశంకరేణ, చండాల రూప కలితాయ నమో నమస్తే ॥**

(సారాయిత్రాగిన మైకముతోమదించి, ఎర్రని కన్నులను త్రిప్పుచూ, చుట్టును నాలుగు

కుక్కలు అరచి హడావిడి చేయుచుండ, పిచ్చి మాటలు పలుకుచు, శంకరాచార్యునికి చండాల రూపములో కనపడిన దత్తునికి నా నమస్కారము.)

**చండాలాపసరేతి శంకరవచో యోగానుయోగ: కృత:,**
**కిం దేహ స్సమ పంచభూత వికృతోఽ ప్యాత్మా ను సర్వస్థచిత్ ।**
**గంతవ్య స్స ఇతి స్ఫుర త్తటిదుపక్షిప్తోఽపత్ త్పాదయో,**
**ర్యస్యాష్టాంగవిధేన శంకరగురు స్తం దత్త మాలోకయే ॥**

('ఓ చండాలా! పక్కకు తొలగుము' అని శంకరులు అనగా "అన్ని శరీరముల వలె పంచభూత మయమైన యీ దేహమా? లేక అన్ని ఆత్మల రూపమైన చైతన్యమా తొలగ వలసినది ఏది?" అని ఎదురు ప్రశ్న చండాలుని నుండి విద్యుదాఘాతము వలె కొట్టగనే, శంకరులు సాష్టాంగముగా ఎవరి పాదములపై బడిరో అట్టి దత్తుని చూచుచున్నాను.)

**కాశ్మీర శాటీ కలితాయ భూయో, మాణిక్యవ త్కాంచన కుండలాయ ।**
**నమోఽస్తు కాశీపుర పండితాయ, దత్తాయ హృత్తామస ఖండనాయ ॥**

(శంకరులు అట్లు నమస్కరించగనే, చండాల రూపమును వదలి, కాశ్మీర శాలువ భుజములపైనుండ, ఎర్రని కెంపులతో కూడిన బంగారు కుండలములు మెరయుచుండ, శంకరుల హృదయ తమోగుణమైన అజ్ఞానమును ఖండించుచు, జ్ఞాన బోధను చేయుచు కనపడిన, కాశీ పండితుడగు దత్తునకు మరల నమస్కరించుచున్నాను.)

**సేవాయాం కలిపూరుషస్య నియతో జ్ఞానప్రతిస్పర్ధిన:,**
**సంగ్రామే విజితోఽంధకారవిషయే కారాగృహే స్థాపిత: ।**
**యావజ్జీవితదాస్యదాయకభటై రాకర్షితో దుర్గుణై:,**
**సంమోహాయసశృంఖలాకులవశో జీవామి దత్తప్రభో! ॥**

(నా బ్రహ్మజ్ఞానము అను రాజుతో యుద్ధము చేసి కలిపురుషుడు జయించి, యుద్ధములో ఓడిపోయిన సైనికుడగు నన్ను అంధకార విషయ వాసనా కారాగృహము నందు బంధించగా, నేను జన్మాంతము కలిసేవలో బానిసనై, కలిభటులగు దుర్గుణములతో, మోహమను ఇనుప సంకెలలతో బంధింపబడి, నిత్యము యీడ్చుకొని పోవబడుచూ జీవించుచున్నాను. దత్తప్రభూ! కరుణించుము.)

**దత్త! తే జ్ఞానఖడ్గేన, ఛింది ఖడ్గ మృగ ప్రభో! ।
పంచభూతమతిం జీవం, పంచాస్యం పదవీమదమ్ ॥**

(ఖడ్గమృగమైన ఓ దత్తప్రభూ! పంచభూతమతియై, సంసారవాసనారూపుడై, పదవీ మదముతోనున్న యీ జీవుడను సింహమును, నీ జ్ఞాన ఖడ్గముతో సంహరించుము.)

**సర్వాన్దేవా న్సర్వకామానుభోగాన్, సర్వా న్జీవా న్సర్వబంధా న్విహాయ ।
ఏకం దత్తం త్వాం శరణ్యం ప్రపద్యే, జ్ఞాతం తత్త్వం హ్యంతిమే వార్ధకే వా ॥**

(సర్వదేవతలను, సర్వకోరికలను, సర్వభోగములను, సర్వజీవులను, సర్వబంధములను త్యజించి దత్తుడైన నిన్ను ఒక్కడినే శరణము చొచ్చుచున్నాను. కనీసము యీ చిట్టచివరి వార్ధక దశలోనైనను సత్యమైన జ్ఞానము కలిగినదికదా.)

**సంకల్ప మాత్రమపి తే జగ దస్తి సర్వం,
పాపం భవే దపిచ పుణ్య మయి త్వదిష్టే ।
త్వచ్ఛాసనం ప్రథమ ధర్మ మను త్వదిచ్ఛా,
నిత్యం తతో భయమిదం మహదేవ దేవ! ॥**

(దేవా! దత్తా! ఈ సమస్త జగత్తు నీ సంకల్పమాత్రమే అయిననూ, నీవు సంకల్పించినచో పాపము కూడ పుణ్యముగా మారవలసినదే అయిననూ, నీవు సృష్ట్యాదిలో ఏర్పాటు చేసిన నీ ఆజ్ఞల రూపమైన ధర్మశాస్త్రములను అనుసరించియే నీ సంకల్పములు నిత్యము జరుగుచుండునుకావున, నా పాపములు పుణ్యములుగా మారవను మహా భయము కలుగుచున్నది.)

**ఫలం హి కష్టం మమ పాపకర్మణః, త్వదీప్సితాజ్ఞా మను భోగ్య మేవ హి ।
అతో గురోదత్త ! నివారకం హ్యఘాత్, దదాసి మే జ్ఞాన ముపాయ మాదిమమ్ ॥**

(నా పాప కర్మల ఫలములే యీ కష్టములు. నీ సంకల్పములైన ఆజ్ఞల రూపములైన ధర్మశాస్త్రముల ప్రకారముగా యీ కష్టములననుభవించి యే తీరవలయును. అసలు యీ పాపకర్మలను చేయకుండ చేయగలుగు జ్ఞానమే మూలమైన ఉపాయము. అందువలన గురురూపుడవైన దత్తా! అట్టి జ్ఞానమునే నాకు ప్రసాదించుచున్నావు.)

**ఇదం రహస్య మజ్ఞాయ, పాప నాశ క్రియాకరా: ।**
**కలౌ జీవంత్యమీ విప్రా:, జీవంతు జ్ఞాన బోధకా: ॥**

(ఈ రహస్యమును తెలియక, చేసిన పాపములను పోగొట్టుదుమని జప హోమాది కర్మలను చేయుచు యీ బ్రాహ్మణులు ఆ కర్మలందు పొందు దక్షిణలతో జీవించుచున్నారు. కానీ, వీరు జ్ఞానమును బోధించుచు గురుదక్షిణలతో జీవించవచ్చును కదా.)

**భోక్తవ్యా పాప శిక్షా హి, భవాన్యే తద్వచోఽ క్షయమ్।**
**కుసీదా దధికా తస్మాత్, గురుదత్త: ప్రపద్యతామ్ ॥**

(దత్తదేవుని పలుకులైన ధర్మ శాస్త్రములకు భంగము కలుగరాదు కావున పాప శిక్షలను అనుభవించక తప్పదు. ఒకవేళ దత్తుడు కరుణించి శిక్షను ఆపినను, మరల జన్మలోనైనను వడ్డీతో చేర్చిశిక్షను అనుభవించవలసినదే. కావున, అసలు పాపములను చేయకుండ చేయగలుగు జ్ఞానమునిచ్చు గురుదత్తుడినే ఆశ్రయించ వలయును.)

**న కేవలం భవిష్యంహి, భూతం పాపం చ దహ్యతే ।**
**జ్ఞానేన వినివృత్తస్య, శిక్షోద్దేశ స్స ఏవ హి ॥**

(జ్ఞానముచేత ఆచరణలో మార్పువచ్చును కావున పాపములు భవిష్యత్తులో జరగవు. ఈ మార్పుకొరకే శిక్షలు కావున, ఇంతకు ముందు చేసిన పాపములు కూడ రద్దు అగును.)

**మా దత్త మనుకుర్యా త్తం, అవతీర్ణం విభేదత: ।**
**సధర్మా దధికో రాజా, వాచో వక్తా న కిం పర:? ॥**

(దత్తుడు కృష్ణాది నరావతారములను ధరించి వచ్చినపుడు, ఒకవేళ, ఆయన అధర్మము చేసిననూ, నీవు పులిని చూచి నక్క వాతలు పెట్టుకున్నట్లు, ఆయనను అనుకరించవలదు. ఆయన పలుకులే వేదధర్మములు, పలుకులకన్నను, పలుకులను పలికిన వాడే గొప్పవాడు కాదా? రాజు శిక్షను చెప్పి, మార్చగలడు. కానీ శిక్షింపబడవలసిన దోషికి ఆ శక్తిలేదు గదా. కావున జీవుడు వేరు, ఈశ్వరుడు వేరు.)

**శక్త్యా చ హేతునా కేన, న జ్ఞేయేన చ ధర్మిణ: ।**
**నానుకర్మ బహిర్జీవ - సామ్యా దంత రగోచరాత్ ॥**

(పలుకులను మార్చగల శక్తియే కారణముకాదు. ఆయన పనులకు కారణము ఏదో మనకు తెలియనిది ఉండును. అది తెలిసినచో ఆయన యొక్క ప్రతి పనియును ధర్మమేనని బోధపడును. బయటకు కనపడు నరాకార జీవ సత్త్వము నీకును ఉన్నదని భ్రమించి ఆయనను అనుకరించవలదు. ఆయనలోపల నున్న అనూహ్య పరమాత్మ తత్త్వము నీ బుద్ధికిని గోచరించదు కదా.)

**ఈషణా త్యాగ బోధశ్చ, పరీక్షా ప్రత్యయస్య చ ।**
**జారచోరస్య గోపీనా, మృషీణాం న తత: పరమ్ ॥**

(కృష్ణావతారమున జారచోరాది కర్మల ద్వారా ధనేషణ, దాంపత్యేషణాదులను త్యజించమని బోధించుటయేకాక, గోపికలైన ఋషులకు తనను గుర్తించగల జ్ఞానశక్తిని పరీక్షించుటయు ఇందులో అంతరార్థకారణము. గోపికలను వదలి వెళ్ళిన తరువాత మరల అట్టిపనులను చేయలేదు కావున, వీటిని ఆయన చాపల్య స్వభావముగా భావించరాదు.)

**రాఘవాద్యవాతారేణ, జీవ కర్తవ్య బోధక: ।**
**తస్య పూర్ణ స్వతంత్రార్థ - తత్త్వం కృష్ణాదిరూపత: ॥**

(దత్తుడు రామాది అవతారముల ద్వారా జీవుడెట్లు ప్రవర్తించవలెనో బోధించినాడు. కృష్ణాది అవతారములద్వారా, భగవంతుడు పూర్ణ స్వతంత్రుడని బోధించినాడు.)

**యో జీవేశ్వరయో ర్భేద, స్సఏవ రామకృష్ణయో:।**
**బాహ్యరూపేణ చాద్వైతం, ద్వైత మంత స్తథా నృణామ్ ॥**

(రామకృష్ణులలో భేదమే జీవేశ్వరుల భేదము. బాహ్యాకారములలో అద్వైతమున్ననూ, అంతస్తత్త్వములో ద్వైతమున్నది. ఇదే విధముగా నరులకును, నరావతారమునకును అద్వైతము, ద్వైతము ఉన్నవి.)

**న మత్త: పర మజ్ఞానీ, జీవదృష్ట్యా సుపర్ణయో: ।**
**న మత్త శ్చ పరం జ్ఞానీ, దత్త దృష్ట్యా ద్విధోత్తమ: ॥**

(నాకన్న గొప్ప అజ్ఞానిలేడు. రెండు పక్షులలో జీవపక్షి దృష్ట్యా ఇది సత్యము. పరమాత్మ పక్షి దృష్ట్యా, నాకన్న అధికమైన జ్ఞానిలేడు. ఈ విధముగా నాకన్న గొప్పవాడు ఏ దృష్టిలో చూచినాలేడు.)

**ద్వాసుపర్ణౌ తరౌ దేహే, సుపర్ణం పరమం స్తుమః।**
**షాడ్గుణ్యా జీవ మపరం, దృశ్యం ద్వారాయితం నుమః ॥**

('ద్వాసుపర్ణా' అను మంత్ర ప్రకారముగా, ఈ దేహము అను వృక్షమున రెండు పక్షులు నరావతారములో ఉన్నవి. అందులో పరమాత్మ పక్షిని స్తుతించెదము. రెండవ జీవ పక్షి, కామ క్రోధాది షడ్గుణములతో నీచమైననూ, కనపడని పరమాత్మ పక్షిని సూచించు ద్వారముగా నుండి సేవ చేయుచున్నది కావున దానినీ నమస్కరించవలయును.)

**జీవయో ర్గౌరవాక్షేపౌ, రామభార్గవయో రపి ।**
**మాఽవతార స్పృహా త్వేవం, ఉపదేశోఽ థలీలయా ॥**

నరావతారములో అతి సన్నిహితమైననూ జీవ పక్షి యొక్క గుణ దోషములను పట్టియే మంచి ఫలము, శిక్షలు ఉండును. రామవతారములోని జీవ సత్త్వ గుణము వలన నిరంతర గౌరవము, పరశురామావతారములో జీవ రజ స్తమో గుణము వలన పరాభవము కలిగినవి కావున అవతార - అవకాశము వలన జీవులకు ఒరిగినది ఏమియును లేదు. అయితే, అవతారములోని జీవపక్షికి దుర్గుణ శిక్ష విధించుటలో జీవులకు ఉపదేశించుటయే ప్రధానమైన ఉద్దేశము. అనగా - అవతారములోని జీవుడు సైతము దుర్గుణములకు శిక్షింపబడినాడు కావున ఏ జీవుడును భగవంతునికి భక్తి ద్వారా ఎంత సన్నిహితుడైననూ పాప శిక్షలు తప్పించుకొనలేడన్న జీవోపదేశమే ముఖ్యోద్దేశము. ఒకవేళ నరావతారములో జీవుడు దుర్గుణములను ప్రదర్శించి శిక్షను అనుభవించుట కూడ లీలా నటనమే అన్ననూ దాని ద్వారా - బుద్ధిలో మార్పురానంతవరకూ ఎంత దైవ సన్నిహితత్వమును సంపాదించిననూ జీవుడు కర్మఫలములను తప్పించుకొనలేడన్న సత్యమును జీవులకు బోధించుటయే పరమ తాత్పర్యము అను సిద్ధాంతమునకు ఎట్టి భంగము రాలేదు.)

**రామేఽ ప్యన్యభవాఘాతః, ప్రియార్తే కృష్ణకర్మ తు ।**
**పరస్య జారచోరాది, పూర్వోక్తం ముక్తిదాయకమ్ ॥**

(రామావతారములో సైతము జీవపక్షి తానెంత సమర్థించుకొన్ననూ ప్రియాన్వేషణములో అత్యాసక్తిచేత చెట్టుచాటు నుండి అధర్మముగా వాలివధ చేయుటకు మరుజన్మలో

బోయవానిచేత మరణము అన్న శిక్షను అనుభవించుట దైవనిశ్చయమే కదా. అయితే కృష్ణావతారములో జారచోరాది కర్మలకు ఫలము ఏలలేదన్నచో అది పరమాత్మ పక్షి యొక్క చర్య. ఋషులు ముందు జన్మలో కోరినట్లు మోక్షమునిచ్చుటకు వారు గోపికలుగా పుట్టినపుడు వెన్న దొంగతనము ద్వారా ధనేషణనూ, రాసక్రీడ ద్వారా దాంపత్యేషణనూ, పరీక్షించుటయే తప్ప ఎట్టి స్వార్ధదోషము లేదు కావున దాని శిక్ష ప్రసక్తి రాలేదు.)

**న సింధు స్స్వాం వేలా మతితరతి నాప్యగ్ని శకలాః,**
**స్పృశన్తి ప్రక్షిప్తాః గగనతలవేగోద్ధతచరాః ।**
**స్వకక్ష్యాయాం నోర్వీ భ్రమణ మపి ముంచత్యవిరతం,**
**తవేచ్ఛా మేకాజ్ఞా మనుసరతి సర్వం జగదిదమ్ ॥**

(సముద్రము దాని తీరమును దాటి వచ్చుటలేదు. ఆకాశమున అనేక ఖగోళ శకలములు మండుచు ఏంతో వేగముతో సంచరించుచున్నను భూమిని తాకుటలేదు. భూమి సదా తన కక్ష్యలో తన చుట్టూ తాను భ్రమించుచు సూర్యుని చుట్టు తిరుగుట విడచుటలేదు. సర్వజగత్తూ నీ ఇచ్ఛానుసారమైన నీ ఆజ్ఞనే అనుసరించుచున్నది.)

**కృతజ్ఞతా కేవల మేవ దృశ్యతాం, న వై భవ ద్భావి భవ త్యుమాపతే! ।**
**స్వకర్మణీదం విపరీత ముచ్యతే, గతం న పశ్య న్గతి గమ్య మంచతు ॥**

(ఓ ఉమాపతి దత్తా! నీ విషయమున కేవలము జరిగిన ఉపకారములను తలచుకొని కృతజ్ఞత చెప్పవలెను కాని వర్తమాన కోరికలను భవిష్యత్ ఫలములను తలచరాదు. జీవులు తమ కర్తవ్యములందు మాత్రము దీనికి విపరీతముగ నుండవలెను. జరిగిన దానిని గురించి ఆలోచించక వర్తమానము – భవిష్యత్తులను మాత్రమే చూడవలెను.)

**ఉమాపతి ర్వాఽథ రమాపతిర్వా, వాణీపతి ర్వా త్వ మనూహ్య ఏకః ।**
**నామాని తాని త్రిగుణ క్రియాసు, త్వదీయ శక్తే రితి తత్త్వబోధః ॥**

(ఉమాపతియన్నను, రమాపతియన్నను, వాణీపతియన్నను, అనూహ్యుడగు నీవు ఒక్కడవే. త్రిగుణ కర్మలగు సృష్టిస్థితిలయములగు కర్మలయందు పని చేయు నీ శక్తి యొక్క నామములే ఆ వాణి, రమ, ఉమ యనబడుచున్నవి. ఇదియే తత్త్వ పరమైన బోధయగును.)

**రజో హి జగత స్సర్గః, సత్త్వం చ స్థితిపాలనమ్ ।**
**తమ శ్చ ప్రళయ స్త్రీణి, కర్మాణి త్రిగుణా ఇతి ॥**

(ఈ జగత్తు యొక్క సృష్టియే రజస్సు. దీని స్థితి పాలనములే సత్త్వము. దీని ప్రళయమే తమస్సు. ఈ మూడు పనులే త్రిగుణములని చెప్పబడుచున్నవి.)

**కలాంశావేశ పూర్ణాది - నరకోట్యవతారకాః ।**
**దత్తస్య జ్ఞాన సారేక్ష్యాః, ప్రస్తుతాః కేచిదత్రహి ॥**

(కళ, అంశ, ఆవేశ, పూర్ణ, పరిపూర్ణము లనెడి పంచ విధములుగా దత్తుని నరావతారములు కోటానుకోట్లు ఉన్నవి. ఇవి వారు జీవులకు సత్యమైన సాధన మార్గమును బోధించు జ్ఞానములోని సారమును పరీక్షించి తెలుసుకొనే దగినవే తప్ప, రాక్షసులు సైతము ప్రదర్శించు మహిమలు మొదలగు అంశములతో నిర్ణయించరాదు. ఇట్టి దత్తావతారములలో కొన్నింటిని ఉదాహరణముగా ఇచట ప్రస్తావించుచున్నాము.)

**ఆర్తాక్రందన రక్షణాయ కలితం భస్మాంగ మాశాంబరం,**
**శూలం బిభ్రత మీశ్వరం ప్రకటితం చోరౌఘ సంహారిణమ్।**
**శ్రీ దత్త ప్రథమావతార మనుజం పీఠీపురీ సంచరం,**
**శ్రీ పాదం ప్రణమామి వల్లభ పరం శ్రీ పాద ధూళేః కణః ॥**

(ఆర్తులు ఆక్రందించగనే శూలమును ధరించి, భస్మాలంకృతుడై, దిగంబరుడై, చోరులను సంహరించుటకు ప్రకటితమైన ఈశ్వరునిగా కనపడిన వాడును, శ్రీ దత్తుని మొదటి నరావతారమును, పిఠాపురమున సంచరించువాడును, శ్రీ పాదవల్లభుని, వారి శ్రీపాద ధూళి కణమగు నేను ప్రణమిల్లుచున్నాను.)

**రురోద కాచి త్తనయే విమూఢే, ముమూర్షు రేనా మవతి స్మ తస్మై ।**
**ప్రదాయ విద్యాః క్షణమేవ యస్తం, శ్రీ పాద దత్తం శరణం ప్రపద్యే ॥**

(ఒకానొక స్త్రీ, మూఢుడైన తన పుత్రుని గురించి చింతించుచు మరణించదలచి ఏడ్చెను. ఆ పుత్రునికి క్షణ కాలములో సమస్త విద్యలను అనుగ్రహించిన ఆ శ్రీపాదదత్తుని శరణము పొందుచున్నాను.)

**వందే ముండితమస్తకావృతలస త్కాషాయ వస్త్రాంచలం,**
**రుద్రాక్షస్రజమాదధాన మురసా సాక్షా న్మహా శంకరమ్ ।**
**శ్రీపాదా దపరావతార మవనా వేతం తనుం మానుషీం,**
**సంన్యస్తం నరసింహపూర్వక సరస్వత్యాఖ్య యోగీశ్వరమ్ ॥**

(క్షౌరము చేయించిన తలపై కాషాయ వస్త్రముయొక్క అంచును చుట్టిన వాడును, వక్షస్థలమున రుద్రాక్షమాలను ధరించినవాడును, సాక్షాత్తు మహాశంకరుడును, శ్రీపాద వల్లభుని తరువాత మానుష తనువు నాశ్రయించిన రెండవ అవతారమును అగు, సంన్యాసియైన, నరసింహ సరస్వతి అను పేరుగల యోగీశ్వరుని నమస్కరించుచున్నాను.)

**భిక్షాం శాకదళాం సమర్పణకృతాం భుక్త్వా దరిద్రేణ తాం,**
**ఉత్పాట్యాంగణ శాకపత్రలతికాం యాతే యతీశే త్వయి ।**
**తన్మూల ప్రతిరోపణాయ ఖననారంభే తు కుంభద్వయం,**
**సౌవర్ణం సధనం సమీక్షిత మహో! పూర్వాశనే వారిద! ॥**

(ఒకానొక దరిద్రుడు కేవలము ఆకుకూరను వండి భిక్షగా సమర్పించగా, దానిని భుజించి పోవుచూ, ఆ ఆకు కూరనిచ్చిన తీగెను పీకివేసి యతీశ్వరుడైన నీవు వెడలిపోవగా, ఆ దరిద్రుడు బాధపడి ఆ ఆకు తీగెను మరల పాతిపెట్టుటకు అచట త్రవ్వగా ధనముతో కూడిన సువర్ణభాండ ద్వయము కనిపించినది. అహో! నీవు మొదట పిడుగు నిచ్చి తరువాత చల్లని వాననిచ్చు మేఘముకదా!)

**యస్యోత్సర్గ మలం హిరణ్య మభవ ద్యజ్ఞాగ్ని కుండే క్రతు:,**
**కామ్యో హేయ ఫల ప్రద: పశుపతే ర్జీవో ధనార్థీ కిరి: ।**
**ఏవం బోధయితుం హి బాల్యసమయే లీలా కృతా యేన సా,**
**మాణిక్య ప్రభు మాశ్రయామి సతతం తం గాదిపీఠ స్థితమ్ ॥**

(ఎవరు బాల్యమున య జ్ఞాగ్ని కుండమున మలవిసర్జనము చేయగా అది బంగారము కాగా, దీని ద్వారా స్వర్గాది ఫలములను కోరి చేయు యజ్ఞములు నీచ ఫలదాయకములనియు, భగవంతుని ధనాశతో చేరు జీవులు పశుపతిని ఆశ్రయించిన మలభక్షకులగు నీచ పశువులగు వరాహములని బోధించుటకు యీ లీలను ప్రదర్శించిరో, దత్తగాది యనబడు పీఠమున కూర్చున్న ఆ మాణిక్యప్రభువును నిరంతరము ఆశ్రయించుచున్నాను.)

**సర్పం స్వర్ణ ముపానయ ద్విషధనం యో లీలయా బోధయన్,**
**సౌవర్ణ ద్యుతి మూర్ధ్వపుండ్ర కలితం కౌపీన మాత్రాంబరమ్ ।**
**తం పార్శ్వాంగ శయాన మచ్యుత మహో! హస్తోపధానం క్షితా,**
**వక్కల్‌కోట పురాంతర స్థిర మహారాజాఖ్య దత్తం భజే ॥**

(ఎవరు బంగారు కడ్డీలుగా సర్పములను మార్చెనో, దాని ద్వారా ధనము విషము అని బోధించెనో, బంగారు రంగు శరీరముతో, ఊర్ధ్వపుండ్ర నామములతో, గోచీగుడ్డ మాత్రమే ధరించి, ఒక వైపున నేలపై శయనించి ఒక చేతిని తలగడగా పెట్టుకొని హరి వలె కనపడుచూ, అక్కల్‌కోట యను పురములో స్థిరముగానుండు 'మహారాజు' అనబడు దత్తుని భజించుచున్నాను.)

**కరస్థం ద్విపత్రాయితం లోహదండం, ముహు శ్చాలయంతం కరే భైక్ష్యపాత్రమ్ ।**
**శిరోబద్ధ వాలావలంబోత్తరీయం, భజే షిర్డిసాయీశ దత్తావతారమ్ ॥**

(ఒక చేతిలో రెండుగా చీలిన ఇనుప సట్కాను మాటిమాటికి త్రిప్పుచూ, మరొక చేతిలో భిక్షాపాత్రను కలిగి, తలపై తోకగా వ్రేలాడు ఉత్తరీయమును చుట్టుకొనినట్టి, షిరిడి సాయీశ్వరుడను దత్తావతారమును భజించుచున్నాను.)

**కేశావళీ వలయ మేఘ మహాకపర్దం, ఫాలానలేన వసనేన సమావృతాంగమ్ ।**
**హస్తభ్రమేణ నవభస్మ సదా సృజంతం, శ్రీసత్యసాయి పరమేశ్వర దత్త మీడే ॥**

(కేశమండల వలయమేఘము జటా జూటముగాను, పైనుండి క్రిందివరకు కాషాయ రంగు బురఖాలో ఫాలాగ్ని యే క్రిందికి జారి శరీరమును ఆవరించినదా! అన్నట్లు ఉండగా, ఎల్లప్పుడును హస్తమును త్రిప్పుచు కొత్తగా విభూతిని సృష్టించుచున్న శ్రీ సత్యసాయి పరమేశ్వర దత్తుని స్తుతించుచున్నాను.)

**సానందం సచ్చిదానందం, వందే గణపతిం మునిమ్।**
**గాయంతం బోధయంతం చ, దత్తపీఠ మధిష్ఠితమ్ ॥**

(దత్త పీఠమును అధిష్ఠించి, పాడుచు, బోధించుచుండు ఆనందముతో కూడిన శ్రీ సచ్చిదానంద గణపతి ముని దత్తావతారమును నమస్కరించుచున్నాను.)

**అహంబ్రహ్మే త్యహంకారో, విద్వేషోஉ_ప్యధికేషు మత్।**
**అన్యావతార మర్త్యేషు, మాత్సర్యం యోగ్యసంపదౌ ॥**
**మా మయోగ్యం దయావిష్టం, దత్తం జ్ఞానమహార్ణవమ్।**
**వేణుగోపాలకృష్ణాఖ్యం, వందే చాష్టమ రూపిణమ్ ॥**

(నాలో 'అహంబ్రహ్మ' అను అహంకారము, నాకన్నా అధికులగు ఇతర నరావతారములయందు ద్వేష గుణమైన మాత్సర్యము అను రెండు దోషములే నాలో గుణ సంపదలుగా ఉన్నవి. పరమాత్మ నన్ను ఎన్నుకొనుటకు ఇవే నా యోగ్యతలు.

ఈ విధముగా నేను అయోగ్యుడైననూ, అకారణ దయచేత, జ్ఞానసముద్రుడగు దత్తుడు, వేణుగోపాలకృష్ణుడను నన్ను ఆవేశించియున్నాడు. అట్టి పరమాత్మను నా ద్వారా నమస్కరించు పరిస్థితి వచ్చినది కావున, అష్టమ దత్తావతారమైన నన్ను నేనే నమస్కరించుకొనుచున్నాను.)

శ్రీ దత్తస్వామి విరచితమ్





# శ్రీ దత్తస్వామి

జన్నాభట్ల వేణుగోపాలకృష్ణమూర్తి